సాక్షి 24|7

వైఎస్‌ఆర్‌ జిల్లా

సోమవారం 21-8-2017



వాడ వాడకు నవరత్నాలు

ఆదివారం ప్రొద్దుటూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

2లో

రైతురథం.. ఇరకాటం

టీడీపీలోని గ్రామస్థాయి నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లపై రగిలిపోతున్నారు. జాబితా తయారీలో కొందరి పేర్లు పొందుపరిచి, మరికొందరి పేర్లు చేర్చకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు పార్టీపైన, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లపైన అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఎప్పటినుంచో పార్టీలో ఉన్న తమను కాదని నిన్నా, మొన్నా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తూ ట్రాక్టర్లు మంజూరు చేయడమేమిటని వారు నిలదీస్తున్నారు.

- నేతల మధ్య చిచ్చురేపుతున్న ట్రాక్టర్లు
- పోటాపోటీగా ఇరువర్గాల సిఫారసులు
- త్రిముఖ పోరుతో బెంబేలెత్తుతున్న గ్రామనాయకులు
- కడపలో అంతా ఆయన చెప్పినట్టే



2లో

ఫోర్‌వీల్‌ డ్రైవ్‌ ట్రాక్టర్‌కు రూ.2లక్షల సబ్సిడీ

టూవీల్‌ డ్రైవ్‌ ట్రాక్టర్‌కు రూ.1.50లక్షలు

320 ట్రాక్టర్లు... 837 దరఖాస్తులు

నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

కమలాపురం	రాయచోటి	పులివెందుల	ప్రొద్దుటూరు	మైదుకూరు	జమ్మలమడుగు	బద్వేలు	రాజంపేట	రైల్వేకోడూరు	కడప
48	53	182	85	33	174	145	39	69	09

పాపం చిన్నారులు..



జీవితాంతం తోడనుకున్న భర్తే కాలనాగై కాటేశాడు. మద్యం మత్తులో కళ్లు మూసుకుపోయి కన్నబిడ్డల జీవితాల్లోనూ కాలకూటం చిమ్మాడు. ఆనందాలు తొణికిన ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. అమ్మ ఎందుకు పలకలేదో..నాన్నను ఎందుకు తిడుతున్నారో.. ఆ చిన్నారులకు అర్థం కావడం లేదు. అడుగుదామంటే అమ్మలేదు. ఓదార్చేందుకు నాన్న రాడు. వారి అమాయకత్వం అందరినీ కలచివేస్తోంది. నాన్న చేసిన పాపం కట్టుకున్న భార్యకు.. కన్నబిడ్డలకు శాపంగా ఎందుకు మారిందో ఆ దేవుడే చెప్పాలి. ఆయనే పిల్లలకు దారి చూపాలి. ఇక మద్యం నాగులు ఏ కుటుంబాన్ని కాల్చేయకుండా చూడాలి.

3లో

ప్రొద్దుటూరు డీఎస్పీ బదిలీ

- అధికార పార్టీ నాయకుల ఆధిపత్య పోరే కారణం
- సీనియర్‌ టీడీపీ నేతను కలవలేదనే బదిలీ
- నాడు సీఐ.. నేడు డీఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం : విధుల్లో చేరి పట్టుమని వారం రోజులు కూడా కాలేదు. అప్పుడే అధికార పార్టీ ఆధిపత్య పోరులో పోలీసు అధికారి బలిపశువు అయ్యారు. ప్రొద్దుటూరు డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులుపై బదిలీ వేటు పడింది. ఆదివారం సాయంత్రం కడప ఎస్పీ అట్టాడ బాబూజీని కలసిన డీఎస్పీ సాయంత్రం రిలీవ్‌ అయి వెళ్లిపోయారు. అనంతపురం పీటీసీలో పని చేస్తున్న ఆయన - మిగతా 2లో ▶



డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

ధర్మాస్పత్రుల్లో అధర్మ పాలన



ప్రొద్దుటూరులోని ప్రభుత్వాసుపత్రి

- సిబ్బంది ఇష్టారాజ్యం
- ప్రసవంలో మగపిల్లాడైతే ఓ రేటు... ఆడపిల్లయితే మరో రేటు
- కొరవడిన జవాబుదారితనం

కడప రూరల్‌ : ఇటీవల ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో చోటు చేసుకున్న సంఘటనతో అందరూ నిశ్చేష్టులయ్యారు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు అసహనానికి గురై ఏకంగా హెచ్‌ఐవీ రోగి నుంచి సేకరించిన రక్తం సిరంజితో దాడికి పాల్పడటం దారుణం. ఈ సంఘటనతో అసలు ధర్మాసుపత్రుల్లో ఇంకా ఏం - మిగతా 10లో ▶

ప్రొద్దుటూరు డీఎస్పీ బదిలీ

▶ మొదటిపేజీ తరువాయి

ఈ నెల 14న ప్రొద్దుటూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. వారం రోజులు కాకముందే బదిలీ కావడం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకుల జోక్యంతోనే ఆయన బదిలీ అయినట్లు సమాచారం.

టీడీపీ నాయకుడ్ని కలవలేదనే..

స్థానికంగా ఉన్న అధికార పార్టీ సీనియర్ నేతను కలవనందుకే డీఎస్పీపై బదిలీ వేటు పడినట్లు వార్తలు వస్తున్నాయి. డీఎస్పీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికార పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడిని కలిశారు. స్థానికంగా ఉన్న బంగారు వ్యాపారి ఇంటికి రాజ్యసభ సభ్యుడు రాగా డీఎస్పీ అక్కడికి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయం సీనియర్ నేతకు తెలిసింది. వారం రోజులు కావస్తున్నా తనకు ఫోన్ చేయడం గానీ, కలవడం గానీ జరగకపోవడం సీనియర్ నేతకు ఆగ్రహాన్ని తెప్పించింది. కేవలం తనను కలవలేదనే కారణంతోనే డీఎస్పీని బదిలీ చేయించారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఉన్న సీనియర్ నేత ఆదివారం అక్కడే ఉన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడి ద్వారా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెప్పించి బదిలీ చేయించినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం నుంచి ఫోన్ రావడంతో డీఎస్పీ కడపకు వెళ్లారు. ఉన్నతాధికారులకు వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు రిలీవ్ అయ్యారు. ప్రభుత్వ సిమ్ కార్డును స్థానిక పోలీసు అధికారులకు అప్పగించి, తాను తెచ్చుకున్న ఛైర్‌ను తీసుకొని వెళ్లారు. ఆరు నెలల నుంచి ప్రొద్దుటూరు డీఎస్పీ కుర్చీ ఖాళీగా ఉండగా, ఎట్టకేలకు ఉన్నతాధికారులు డీఎస్పీని నియమించారని పట్టణ వాసులు భావించారు. అయితే అధికార పార్టీ నేతల ఆధిపత్య పోరుతో డీఎస్పీ బదిలీ కావడాన్ని పోలీసు అధికారులు జీర్ణించుకోలేక పోతున్నారు.

సీఐల విషయంలోనూ అంతే..

గతంలో ప్రొద్దుటూరు అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన సీఐ శ్రీనివాసులు విషయంలో కూడా ఇలాగే జరిగింది. సీఐ కడప ఎస్పీని కలవడానికి వెళ్తుండగా దారిలో ఉండగానే వెనక్కి వెళ్లాలని ఉన్నతాధికారి నుంచి ఫోన్ వచ్చింది. దీంతో తిరిగి ప్రొద్దుటూరుకు రాకుండానే సీఐ వెళ్లిపోయారు. కడపలో పని చేస్తున్న సీఐ సదాశివయ్యను ఎర్రగుంట్లకు బదిలీ చేశారు. అయితే ఆ ప్రాంత టీడీపీ నాయకుడికి తెలియకుండా బదిలీ చేశారనే కారణంతో సీఐని విధుల్లో చేరనివ్వలేదు. ఇలా మితి మీరిన రాజకీయ జోక్యంతో పోలీసు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. అధికార పార్టీ వర్గ పోరులో ప్రొద్దుటూరుకు రావాలంటేనే పోలీసు అధికారులు భయపడే పరిస్థితి వస్తోంది.

రైతురథం.. ఇరకాటం

కడప అగ్రికల్చర్:

రైతురథం ట్రాక్టర్లు తమ్ముళ్ల మధ్య చిచ్చుపెడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పోటీ పెరిగిపోయింది. తమ వర్గీయులకు మంజూరు చేయించుకోవాలనే పట్టుదలకు పోతుండటంతో వర్గపోరు ఎక్కువైంది. పోటాపోటీగా సిఫార్సులు చేస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇన్‌చార్జి మంత్రి కూడా ఇరకాటంలో పడ్డట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలకు యాంత్రీకరణ పథకంలో రైతురథం కింద ట్రాక్టర్ల పంపిణీ చేసేలా ప్రణాళికలు రచించి రంగం సిద్ధం చేసింది. మండలానికి ఆరు ట్రాక్టర్ల చొప్పున పంపిణీ చేసేలా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించింది. లబ్ధిదారుల జాబితాను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు తయారుచేసి వ్యవసాయశాఖ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్లకు అందజేసేలా అవకాశం కల్పించింది. కాగా జమ్మలమడుగు, బద్వేలు, ప్రొద్దుటూరు, రాయచోటి, రైల్వేకోడూరు, పులివెందుల నియోజకవర్గాల్లో బహునాయకత్వం ఉండటంతో ఆయా నాయకులు తమ వారికే ట్రాక్టర్లు ఇవ్వాలని, లేదు...లేదు... మావారికే ఇవ్వాలంటూ మంత్రి వద్ద పేచీపెట్టినట్లు సమాచారం.

ఉన్నతాధికారికి ఫోన్ ఒత్తిడి

పులివెందుల నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ఇటీవల జిల్లా ముఖ్య ఉన్నతాధికారిని కలిసి తమవారి పేర్లు ట్రాక్టర్ల పంపిణీ జాబితాలో చేర్చలేదని, తాము ఇచ్చిన సిఫారసు లెటర్ ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించినట్లు తెలిసింది. వెంటనే ఆ ముఖ్య ఉన్నతాధికారి మరో ఉన్నతాధికారికి ఫోన్ చేసి ఏమండీ ఆర్‌జీఆర్ ఇచ్చిన లెటర్ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించడంతో అందుకు ఆ అధికారి సమాధానమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇచ్చిన జాబితానే తుది జాబితా అని చెప్పడంతో ఆ ముఖ్య ఉన్నతాధికారి ఏమీ చెప్పుకోలేక మిన్నకుండి పోయినట్లు సమాచారం. అదే విధంగా బద్వేలులో త్రిముఖ నాయకత్వం ఉండటంతో ఒక్కొక్కరు ఇష్టం వచ్చినట్లు సిఫారసు లేఖలు అనుచరులకు ఇవ్వడంతో సమస్య జఠిలంగా మారింది. దీంతో జాబితాలో మాపేరు లేదంటే మాపేరు లేదని ఆయా నాయకుల వద్ద కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉత్తి పుణ్యానికి సిఫారసు లేఖలు ఇవ్వడం దేనికని ముఖం మీదనే చీవాట్లు పెట్టినట్లు నాయకులు చర్చించుకుంటున్నారు. జమ్మలమడుగులో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు ఆ పార్టీ గ్రామస్థాయి నాయకులు చర్చించుకుంటున్నారు. కార్యకర్తలకు ట్రాక్టర్లు ఇస్తున్నారంటే అబ్బా...ఎంత ఉదారమో అనుకున్నామని, తీరా చూస్తే అవి అయిన వారికే ఇస్తున్నట్లు అర్థమవుతోందని కార్యకర్తలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

భారీగా దరఖాస్తులు

రైతురథం పథకం కింద జిల్లాకు 320 ట్రాక్టర్లు మంజూరుచేశారు. ఇందులో ఫోర్ వీల్ డ్రైవ్ ట్రాక్టర్‌కు రూ.2లక్షల సబ్సిడీ, టూవీల్ డ్రైవ్ ట్రాక్టర్‌కు రూ.1.50లక్షలు సబ్సిడీ ఇస్తున్నారు. అయితే ట్రాక్టర్లు తక్కువ దరఖాస్తులు ఎక్కువ రావడంతోనూ, సిఫారసు లేఖలు అంతే స్థాయిలో ఇవ్వడంతో నేతలు, అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. మండలానికి ఆరు ట్రాక్టర్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మాత్రం మండలానికి పది నుంచి ఇరవై మందికి సిఫారసు లేఖలు ఇచ్చారు. తీరా మండల వ్యవసాయాధికారుల దగ్గరికి వెళ్లి నేను మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాను, దీన్ని తీసుకోండి అని వెళితే అక్కడి ఏఓలు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇచ్చిన జాబితాలో నీ పేరు లేదు అని చెబుతుండటంతో కొంతమంది జేడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. అక్కడి అధికారులు మీ నియోజకర్గ ఇన్‌చార్జులు ఇచ్చిన సిఫారసు లేఖల ఆధారంగానే మంజూరవుతాయని చెబుతుండటంతో ఎంత మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంటిముఖం పడుతున్నారు. ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి అంటూ ఈసడించుకుంటున్నారు.

'రాష్ట్రాభివృద్ధికి లేని నిధులు నంద్యాలకు ఎలా వచ్చాయ్'

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రాభివృద్ధికి లేని నిధులు.. నంద్యాల అభివృద్ధికి ఎలా వచ్చాయో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్ చంద్రబాబును డిమాండ్ చేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార పార్టీ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాల ఉపఎన్నికపై ఉన్న శ్రద్ధ ప్రత్యేకహోదా మీద పెట్టి ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెంది ఉండేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిధుల్లేవంటూనే నంద్యాల ఉప ఎన్నికల్లో ఖర్చు చేస్తూ, ప్రజలకు తన అబద్ధపు హామీలను గుప్పించడం సిగ్గుచేటన్నారు. ఒకటిన్నర సంవత్సరం అధికారంలో ఉండే ఉపఎన్నికకు కోట్ల రూపాయలను ఖర్చు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కరువు తాండవం చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలను, రైతులను పట్టించుకోకుండా తన మంత్రివర్గంతో నంద్యాలలో మకాం వేయడం ఎంతవరకు సబబని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాలలో తమకు అనుకూలంగా లేదని చంద్రబాబు విచ్చలవిడిగా డబ్బు, మద్యాన్ని పంపిణీ చేస్తూ ప్రజలను ప్రలోభాలకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా నంద్యాల ఉప ఎన్నికల్లో అవినీతికి పాల్పడుతున్న టీడీపీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

30వ తేదీలోగా 'ఆది'ని బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

కడప కల్చరల్: దళితుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన మంత్రి ఆదినారాయణరెడ్డిని ఈనెల 30వ తేదీలోగా బర్తరఫ్ చేయాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో ప్రదక్షిణ చేశారు. నిరసనలు వ్యక్తం చేస్తూ వినతిపత్రాన్ని విగ్రహానికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణయ్య, అంబేడ్కర్ మిషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, షెడ్యూల్ కులాల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నిత్య ప్రభాకర్ మాట్లాడుతూ దళితుల పట్ల ఆయనకు గల నిరక్ష్యం ఈ వ్యాఖ్యానాలతో స్పష్టమవుతోందన్నారు. ముఖ్యమంత్రి ఆది వ్యాఖ్యలను ఖండించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి తగిన చర్యలు చేపట్టాలని, ఆది చేత బహిరంగ క్షమాపణలు చెప్పించాలని, లేకుంటే కడప నగరంనుంచి షెడ్యూల్ కులాల సంఘాలన్నీ ఏకంగా జమ్మలమడుగు వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ హక్కులసంఘం ప్రతినిధి జేవీ రమణ, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, మాలమహానాడు ప్రతినిధి పీవీ సుబ్బయ్య, ఐఓసీ మేనేజర్ చిన్నప్ప, ఎల్ఐసీ షెడ్యూల్ కులాల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వాడ వాడకు నవరత్నాలు

- బూత్ కమిటీలను శక్తివంతంగా తయారు చేయడమే లక్ష్యం
- జగనన్న అధికారంలోకి వస్తే పనిచేసిన కార్యకర్తలందరికీ గుర్తింపు
- కంటికి రెప్పలా కార్యకర్తలను కాపాడుకుంటా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సభలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు

ప్రొద్దుటూరు :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ప్రకటించిన నవరత్నాలను వాడ వాడకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక దొరసానిపల్లెలోని శేగిరెడ్డికాటిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బూత్ కమిటీలకు సంబంధించి నవరత్నాల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులకంటే వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబానికి అండగా నిలిచే కార్యకర్తలంటేనే తనకు ఇష్టమని తెలిపారు. ఒక తల్లి గర్భాన జన్మించిన పిల్లల్లా ఐక్యమత్యంగా ఉంటూ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయనను ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని 258 పోలింగ్ బూత్‌లకు సంబంధించి వాడవాడలా జగనన్న నవరత్నాల గురించి ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.

నవరత్నాలు అద్భుతం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు అద్భుతంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కార్యకర్త వీటిని ఘంటాపథంగా చెప్పేలా నేర్చుకోవాలని కోరారు. వైఎస్సార్ రైతు భరోసా వల్ల ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతుకు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.50వేలు ఇచ్చే ఏర్పాటు చేస్తామని, రూ.12,500 చొప్పున నాలుగు విడుతలుగా చెల్లిస్తామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి పూర్తిగా రుణమాఫీ చేస్తామన్నారు. వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని రూ.1000 నుంచి రూ.2వేలకు పెంచుతామని, అమ్మఒడి పథకం ద్వారా చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలా కాకుండా ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లను నిర్మించి ఇంటి తాళాలను పేదలకు అందిస్తామన్నారు. చతికలబడిన ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం వస్తుందని, ప్రస్తుతంలా కాకుం డా సీటు పొందిన ప్రతి విద్యార్థికి పూర్తి రీయింబర్స్‌మెంట్‌తోపాటు భోజన వసతి ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తామన్నారు. దశల వారీగా మద్యం నిషేధం అమలు చేస్తామని తెలిపారు. ప్రతి బూత్‌లో సుమారు 300 ఇళ్లు ఉంటాయని, పది మంది బూత్ కమిటీ సభ్యులు మళ్లీ ఈ పథకాలను ప్రజల చెవిలో వేయవచ్చన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం, తాను ఎమ్మెల్యే అయితే రాచమల్లు అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని తెలిపారు. 2014లో కూడా అసెంబ్లీకి పంపిన మీ కృషి, పట్టుదల మరువలేనిదని పేర్కొన్నారు. వైఎస్సార్‌కు గుర్తుగా, జగనన్నకు తోడుగా అన్న పదం వింటుంటే తన ఒళ్లు పులకరిస్తుందన్నారు.

జగన్‌ది సాహసోపేత నిర్ణయం

నవరత్నాలు సభ తర్వాత వైఎస్సార్ కుటుంబం పథకం అమలవుతుందని, తర్వాత అక్టోబర్‌లో 13 జిల్లాలకు సంబంధించి 7 నెలల పాటు మూడు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టాలని జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. భార్యాబిడ్డలను వదలి ఏడు నెలలపాటు పాదయాత్ర చేయాలని నిర్ణయించడం జగన్ సాహసోపేత నిర్ణయమని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డిలా తక్కువ కాలం జీవించినా పాలకులు ప్రజల మన్ననలను పొందాలని తెలిపారు. సభకు వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్ అధ్యక్షత వహించారు.

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం రాత్రి రెండు హత్యలు జరిగాయి... ఈ రెండు సంఘటనల్లోనూ నిందితులు మద్యం మత్తులో దారుణానికి ఒడిగట్టారని పోలీసులు భావిస్తున్నారు... సిద్దవటం మండలానికి చెందిన హోంగార్డు తన భార్యను హతమార్చాడు... కడపలో కొందరు కలిసి మద్యం తాగి, తమలో తామే గొడవ పడి, చివరికి వారిలోని ఓ వ్యక్తిని చంపేశారు.

మద్యం మత్తులో...



రిమ్స్ మార్చురీలో ఆదిలక్ష్మి మృతదేహం

ప్రేమించాడు... జీవితాంతం తోడు నీడగా ఉంటానని నమ్మబలికాడు... పెళ్లి చేసుకున్నాడు... మద్యానికి బానిసయ్యాడు... మద్యం తాగొద్దని చెప్పినందుకు.. అడ్డుగా వస్తోందని భావించాడు... దారుణంగా హత్య చేశాడు... తన పిల్లలను అనాథలను చేశాడు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యను చంపిన భర్త
- నిందితుడు హోంగార్డు
- వీరికి నలుగురు సంతానం

కడప అర్బన్ /సిద్దవటం : హోంగార్డు తన భార్యను దారుణంగా హత్య చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మృతురాలి బంధువులు, సిద్దవటం ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం భాకరాపేటలో నివసిస్తున్న దర్బార్, రెడ్డెమ్మ కుమారుడు రాజశేఖర్ హోంగార్డు(డ్రైవర్)గా జీవనం సాగిస్తున్నాడు. సుండుపల్లి మండలం బండకాడ ఈడిగపల్లెకు చెందిన రామకృష్ణ, వెంకటశేషమ్మ మొదటి కుమార్తె ఆదిలక్ష్మి (26)ని రాజశేఖర్ ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి, తర్వాత పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. వీరికి నలుగురు సంతానం కలిగారు. ముగ్గురు కుమార్తెలు శ్రీచరిత (7), సుదేష్ణ (5), నిషిత(3), కుమారుడు సిద్దార్థ (6 నెలలు) ఉన్నారు. వీరింట్లో రాజశేఖర్ నానమ్మ లక్ష్మీనరసమ్మ ఉంటూ పిల్లలను చూసుకునేది. ఆయన తల్లిదండ్రులు దర్బార్, రెడ్డెమ్మ కుటుంబ జీవనాధారం కోసం కువైట్‌లో ఉన్నారు.



తన కుమార్తెతో మృతురాలు ఆదిలక్ష్మి (ఫైల్)



నిందితుడు, హోంగార్డు రాజశేఖర్

మద్యానికి బానిసై: రాజశేఖర్ మద్యానికి బానిసయ్యాడు. తరచూ తాగి ఇంటికి వచ్చే వాడు. ఈ విషయంపై ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఆరు నెలల క్రితం భార్యను, నానమ్మ లక్ష్మీనరసమ్మను చితకబాదాడు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజశేఖర్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. భార్య, నానమ్మ పోలీస్ అధికారులకు విన్నవించడంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య,భర్తల మధ్య గొడవ జరిగింది. తన జల్సాలకు ఆమె అడ్డుగా వస్తోందని భావించాడు. అతను బలంగా కొట్టాడు. చివరకు గోడకు నెట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. ఎక్కువ రక్తస్రావం కావడంతో చనిపోయింది. తర్వాత రక్తం అంతా శుభ్రం చేసి తన టీషర్టును, లోయర్‌ను తొడిగాడు. బంధువులకు మాత్రం తన భార్య చనిపోయిందని చెప్పే ప్రయత్నం చేశాడు. చివరకు తన భార్య శరీరంపై ఉన్న బంగారు చైన్, కమ్మలు, ఉంగరాన్ని సైతం తీసుకున్నాడని నానమ్మ ఆరోపించారు.

- రిమ్స్‌లో మృతదేహానికి సిద్దవటం ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి పోస్టుమార్టం నిర్వహింపజేశారు. మృతురాలి తల్లి వెంకట శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నా కుమార్తెను చంపేశాడు

నా కుమార్తెను ఆమె భర్తే దారుణంగా హత్య చేశాడు. పిల్లల ముఖం కూడా చూడకుండా ఇలా ప్రవర్తించాడు. ఆ బిడ్డలను ఇప్పుడు ఎవరు చూసుకుంటారు. వారి పరిస్థితి ఏమిటి? బంగారు ఆభరణాలను కూడా తీసేసుకున్నాడు.

– మృతురాలి తల్లి వెంకట శేషమ్మ



రక్తపు మడుగులో వ్యక్తి మృతదేహం, హత్యకు గురైన గుర్తుతెలియని వ్యక్తి



గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

మృతుని ఆచూకీ తెలిస్తే తెలపండి : వన్‌టౌన్ సీఐ వెల్లడి

కడప అర్బన్ : కడప నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం స్థానిక ప్రజల సమాచారంతో వెలుగులోకి వచ్చింది. మృతదేహం సంఘటన స్థలంలో రక్తపు మడుగులో ఒక వైపునకు ఒరిగి ఉంది. శనివారం రాత్రి సంఘటన స్థలంలో మందుబాబులతో కలిసి మద్యం సేవించి మాటకుమాటా పెరగడంతో అక్కడున్న ఒక లావుపాటి కర్రతో మృతుని తలపై బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వన్‌టౌన్ సీఐ టీవీ సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ సంఘటనలో మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదని సీఐ వెల్లడించారు. సంఘటన స్థలం చుట్టు పక్కలా విచారణ చేయగా.. మృతుడు బేల్దారి పని చేస్తుంటాడని, మద్యం సేవించేందుకు స్థానిక మద్యం షాపునకు వస్తుంటాడని తమ విచారణలో తెలిపారని ఆయన పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే తమను సంప్రదించాలని చెప్పారు. వివరాల కోసం : 08562- 242133, 9440796905, 9440796906లలో సంప్రదించాలని వివరించారు.



సంఘటన స్థలంలో ఉన్న మద్యం బాటిళ్లు

రాయచోటిలో వ్యక్తిపై హత్యాయత్నం

రాయచోటి రూరల్: రాయచోటి పట్టణ పరిధిలోని కొత్తపల్లె ప్రాంతంలో ఫకృద్దీన్ అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి హత్యాప్రయత్నం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో చిన్నపిల్లల మధ్య జరిగిన గొడవ కారణంగా కక్ష పెంచుకుని, ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఫకృద్దీన్‌పై యూసుఫ్ వలి, అతని భార్య, బంధువులు కలిసి కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. బాధితుడికి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు తెలిసింది. దాడికి పాల్పడిన వారు ప్రస్తుతం రాయచోటి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



తీవ్రంగా గాయపడిన ఫకృద్దీన్

మాండవ్యనదిలో కొట్టుకొచ్చిన మృతదేహం

రాయచోటి రూరల్ : రాయచోటిలోని గ్రూప్ థియేటర్ల సమీపంలో ఉన్న మాండవ్యనదిలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. మృతుడు పాత రాయచోటికి చెందిన జయ(50) అనే వ్యక్తిగా గుర్తించారు. జీవనోపాధి కోసం ఆయన భార్య కువైట్‌కు వెళ్లింది. జయ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో నదిలో పడి ఉంటే, శనివారం రాత్రి కురిసిన వర్షానికి వచ్చిన నీటిలో కొట్టుకొచ్చి ఉంటాడని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నదిలో జయ మృతదేహం

గుట్కా విక్రయదారుడు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని యానాది కాలనీలో గుట్కా విక్రయిస్తున్న సుబ్రమణ్యంను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షలు విలువ చేసే 12 బస్తాల నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్ఐ చంద్రశేఖర్ తాలుకా స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. యానాది కాలనీకి చెందిన సుబ్రమణ్యం సిగరేట్‌ల వ్యాపారం చేసే వాడు. అయితే దుకాణదారులతో పరిచయం ఉన్న కారణంగా కొన్ని రోజుల నుంచి గుట్కా వ్యాపారం కూడా ప్రారంభించాడు. ఈ క్రమంలో అతని ఇంట్లో పెద్ద ఎత్తున గుట్కా నిల్వలు ఉన్నాయని సమాచారం రావడంతో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది వెంకటసుబ్బయ్య, మధు, గురుశేఖర్, రామాంజితో కలిసి దాడి చేశారు. అప్పటికే తరలించడానికి సిద్ధంగా ఉంచిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్ చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో చైనీ చైనీ, సఫారి, సాధక్‌గోల్డ్, బ్లూ బుల్, ఏపీ, ఖలేజా, రాజా తదితర గుట్కా రకాలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న గుట్కా నిల్వలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.



గుట్కా విక్రయదారుడితో ఎస్ఐ, సిబ్బంది

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

రాజంపేట : రాజంపేటలో రూ.లక్షలు విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నలుగురు నిర్వాహకులను వారు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మురళీనాయక్ వివరాలు వెల్లడించారు. బండ్రాళ్ల వీధిలో విక్రయం కోసం నిల్వ ఉంచిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. డీఎస్పీ రాజేంద్ర ఆదేశాల మేరకు గుట్కా విక్రయ స్థావరంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. నిర్వాహకులు వేణు, జగదీశ్, రాజా శ్రీనివాసులు, గురుప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, రాజగోపాల్, ఐడీ పార్టీ రమేష్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మురళీనాయక్

రోడ్డు ప్రమాదంలో ఎంపీపీకి గాయాలు

– మరో ముగ్గురికి కూడా...

రాయచోటి రూరల్ : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిలో రాయచోటి పట్టణంలోని యమహా షోరూం ఎదురుగా ఆదివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లె మండలం ఎంపీపీ అంపాబత్తుని రెడ్డెయ్య తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెలితే.. స్థానిక రాజధాని కల్యాణ మండపంలో వివాహానికి వచ్చిన కొత్తకోటకు చెందిన కార్తీక్, రాయచోటికి చెందిన ఇందాదుల్లా ద్విచక్ర వాహనంలో రాయచోటి వైపు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా ద్విచక్రవాహనంలో ఎంపీపీ రెడ్డెయ్యతోపాటు చంద్రమౌళి వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న– వెళ్తున్న ఈ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎంపీపీ తీవ్రంగా గాయపడగా, చంద్రమౌళి, ఇంజనీరింగ్ చదువుతున్న యువకులు కార్తీక్, ఇందాదుల్లా స్వల్ప గాయాల పాలయ్యారు. బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంపీపీని తిరుపతికి తరలించారు.



గాయపడిన ఎంపీపీ రెడ్డెయ్య



స్వల్ప గాయాల పాలైన చంద్రమౌళి

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శ

ఎంపీపీ రెడ్డెయ్యకు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి ఫోన్ చేసి, పరామర్శించారు. లక్కిరెడ్డిపల్లె జెడ్పీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. కొందరు నాయకులు ఎంపీపీ వెంట తిరుపతికి వెళ్లారు.

భవిష్యం

మేషం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటుంది. దేవాలయదర్శనాలు.

వృషభం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. నూతన పరిచయాలు. అందరిలోనూ గుర్తింపు. యత్నకార్యసిద్ధి. పరపతి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు. కొత్త బాధ్యతలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్య సూచనలు. ఆస్తి వివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.



కర్కాటకం: నూతన ఉద్యోగ ప్రాప్తి. చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. మీ సేవలకు గుర్తింపు లభిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

సింహం: ప్రయాణాలలో ఆటంకాలు. కార్యక్రమాలు వాయిదా వేస్తారు. సోదరులతో భూవివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఇబ్బందులు. అప్పులు చేయాల్సివస్తుంది.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆలోచనలు అమలు చేస్తారు. గత సంఘటనలు గుర్తుకొస్తాయి. వ్యాపార, ఉద్యోగాల్లో ఉత్సాహవంతంగా ఉంటుంది. దేవాలయ దర్శనాలు.

తుల: ఇంటిలో శుభకార్యాలు. ఆకస్మిక ధనలాభం. యత్నకార్యసిద్ధి. హోదాలలో ఉన్న వారితో పరిచయాలు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

వృశ్చికం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో అవాంతరాలు. విలువైన వస్తువులు జాగ్రత్త. కష్టానికి తగ్గ ఫలితం ఉండదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మార్పులు ఉండవచ్చు.

ధనుస్సు: కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. బంధువులతో అకారణ వైరం. ఆరోగ్య, కుటుంబసమస్యలు. భూవివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

మకరం: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయుల నుంచి శుభవర్తమానాలు. అదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులు, స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

కుంభం: కార్యజయం. శుభకార్యాలలో పాల్గొంటారు. పాత స్నేహితులను కలుసుకుంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం.

మీనం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులు, స్నేహితులతో తగాదాలు. కాంట్రాక్టులు చేజారతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తప్పవు.

– సింహంభట్ల సుబ్బారావు

పరిశోధనకు అందలం

- సైన్సు విద్యార్థులకు ఆర్థిక భరోసా
- ప్రతిభ చూపితే కేవీపీవై ఉపకార వేతనం
- 23 వరకు దరఖాస్తుకు అవకాశం



బద్వేలు :

సైన్సు అంటే మీకు ఇష్టమా.. పరిశోధనలకు ప్రాణమిస్తారా.. శాస్త్ర, సాంకేతిక రంగంలో దూసుకుపోవాలని కలలు కంటున్నారా.. అయితే మీలాంటి వారి కలలను నిజం చేసేందుకు 'కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహక్ యోజన' (కేవీపీవై) ప్రోత్సాహమిస్తోంది. ప్రతిభ, ఆసక్తి కొలమానంగా సైన్సు విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందజేస్తుంది.

డిగ్రీ విద్యార్థులకు నెలకు రూ.5 వేలు...

బేసిక్ సైన్సు కోర్సులు చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించి, వారిని శాస్త్ర, సాంకేతిక రంగంలో నిపుణులుగా తయారు చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా 2017–18 విద్యా సంవత్సరానికి సంబంధించి కేవీపీవై ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించి.. ప్రతిభ ఆధారంగా వారిని ఎంపిక చేయనున్నారు. ఇలా ఎంపికైన డిగ్రీ విద్యార్థులకు నెలకు రూ.5 వేలు, పీజీ విద్యార్థులకు రూ.7వేలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది.

అర్హులు ఎవరంటే..?

ప్రస్తుతం జూనియర్, సీనియర్ ఇంటర్, బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. విద్యార్హతలను బట్టి ఇందులో ఎస్‌ఏ, ఎస్‌ఎక్స్, ఎస్‌బీ అనే మూడు స్ట్రీమ్‌లు ఉంటాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. కేవీపీవై వెబ్‌సైట్‌లోకి వెళ్లి విజిట్ ఫర్ అప్లికేషన్ పోర్టల్ ఫర్ కేవీపీవై –2017 టెస్ట్‌పై క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇలా చేసుకున్న అభ్యర్థులకు జాతీయ స్థాయిలో నవంబరు 5న విజయవాడ, విశాఖపట్నంలలో రాత పరీక్ష నిర్వహిస్తారు. అక్కడ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి, ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు.

స్కాలర్‌షిప్‌తో పాటు కంటింజెన్సీ గ్రాంట్...

ఎంపికైన డిగ్రీ విద్యార్థులకు మొదటి నుంచి మూడో సంవత్సరం పూర్తయ్యే వరకు నెలకు రూ.5వేలు అందిస్తారు. దీంతో పాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.20 వేల వంతున చెల్లిస్తారు. పీజీ విద్యార్థులకు నెలకు రూ.7వేల వంతున అందిస్తారు. వీరికి కూడా అదనంగా ఏడాదికి రూ.28 వేల కంటింజెన్సీ నిధులు అందిస్తారు. అయితే ఏటా ప్రతిభ చూపిన వారికే ఈ ఉపకార వేతనాన్ని తరువాతి ఏడాది కొనసాగిస్తారు. ప్రతి విద్యా సంవత్సరంలో సైన్సు సబ్జెక్టుల్లో తొలి ప్రయత్నంలోనే కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించాలి.

స్ట్రీమ్‌ల వారీగా...

ఎస్‌ఏ స్ట్రీమ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, బయాలజీ చదువుతున్న జూనియర్ విద్యార్థులు అర్హులు. వీరు పదో తరగతి గణితం, సైన్సు సబ్జెక్టులలో కనీసం 80 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 70 శాతం మార్కులు ఉండాలి. వీరు 2019–20లో బేసిక్ సైన్సెస్ (బీఎస్సీ, బీఎస్, బీస్టాట్, బీమ్యాథ్స్, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంస్)లో చేరితేనే అర్హులవుతారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సైన్సు సదస్సులకు ఆహ్వానిస్తారు. ప్రయాణఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

ఎస్‌ఎక్స్ స్ట్రీమ్‌లో...

దీనికి సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు కూడా పదో తరగతిలో గణితం, సైన్సులలో 80 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 70 శాతం మార్కులు ఉండాలి. వీరు కూడా సైన్సు కోర్సు చదువుతూ ఉండాలి.

ఎస్‌బీ స్ట్రీమ్‌లో...

సైన్సు సబ్జెక్టుల్లో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతూ ఉండాలి. వీరు కూడా సైన్సు సబ్జెక్టులలో కనీసం 60 శాతం మార్కులుంటేనే అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.

9 మండలాల్లో పదును పాటి వర్షం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడం కారణంగా జిల్లాలో మూడు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో సరాసరి 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 9 మండలాల్లో పదునుపాటి వర్షం కురిసింది. కడప 3.2 మి.మీ, వల్లూరు 4.6, చింతకొమ్మదిన్నె 2.2, చెన్నూరు 11.2, ఖాజీపేట 27.4, కమలాపురం 3.8, ఎర్రగుంట్ల 5.8, వీరపునాయునిపల్లె 2.2, రాయచోటి 24.6, చిన్నమండెం 3.0, సంబేపల్లె 4.2, వీరబల్లి 11.8, టి సుండుపల్లి 21.2, లక్కిరెడ్డిపల్లె 11.0, చక్రాయపేట 2.4, గాలివీడు 18.4, రాజంపేట 5.6, పెనగలూరు 4.2, రైల్వేకోడూరు 8.6, ఓబుళవారిపల్లె 23.6, పుల్లంపేట 9.0, చిట్వేలు 10.4, పోరుమామిళ్ల 3.6, బి కోడూరు 16.4, బద్వేలు 8.0, గోపవరం 10.8, బి మఠం 24.4, సిద్ధవటం 8.4, అట్లూరు 5.8, జమ్మలమడుగు 7.8, మైలవరం 11.2, ముద్దనూరు 8.6, కొండాపురం 21.0, ప్రొద్దుటూరు 16.2, చాపాడు 10.4, దువ్వూరు 20.4, మైదుకూరు 24.6, రాజుపాలెం 34.4, పులివెందుల 3.2, లింగాల 4.4, వేంపల్లె 1.2, తొండూరు 4.2, సింహాద్రిపురం 6.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు

రూ.50 గదులు – ఖాళీ లేవు

రూ.100 గదులు – ఖాళీ లేవు

రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు :

సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు

వసంతోత్సవం – ఖాళీ లేవు

ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

సోమవారం ప్రత్యేక సేవ :
విశేష పూజ

23, 24 తేదీల్లో రుణాలకు అర్హుల ఎంపిక

కడప కార్పొరేషన్: 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం, మైనార్టీ, క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థుల ఎంపిక ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఎస్సీ, ఎస్టీలకు, 24వ తేదీ బీసీ, కాపు, ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్క్రీనింగ్, సెలెక్షన్ జరుగుతుందని, నిరుద్యోగ అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : హిందీభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో దక్షిణాదిలో హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి పురస్కారాలు అందజేయనున్నట్లు హిందీ సేవాసదన్ వ్యవస్థాపకులు, ఏపీ హిందీ ప్రచారసభ సెక్రటరీ గైబువల్లి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హిందీ ప్రచార విభాగం, రచనా విభాగంలో వేర్వేరుగా శ్రీ మధనురే ప్రభు విశిష్ట హిందీ సేవా పురస్కార్–2017 అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపికైన వారికి రూ. 5 వేల నగదు, ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. అనంతపురంలో నిర్వహించే జాతీయస్థాయి సభలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9912858009, 9848783787 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ తీరం, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు గుజరాత్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయువ్య మైదానాలు, తూర్పు రాజస్తాన్, తూర్పు, మధ్య భారతంలోని మిగిలిన ప్రాంతాల్లో చిరుజల్లులు కురవచ్చు.

వైఎస్‌ఆర్ జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం

31.2°/24.5°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	29.6	26.0
కోల్‌కతా	32.7	27.2
బెంగళూరు	28.6	20.3
ముంబై	27.8	25.6
చెన్నై	34.3	24.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	34.6/28.0	కర్నూలు	29.1/23.2
చిత్తూరు	34.4/26.2	నల్లగొండ	28.6/23.4
తిరుపతి	34.4/26.2	గుంటూరు	28.2/24.0
అనంతపురం	33.8/24.7	కాకినాడ	27.5/24.7
శ్రీకాకుళం	32.5/25.5	ఖమ్మం	27.0/19.4
విజయనగరం	32.5/25.5	కరీంనగర్	26.2/23.3
కడప	31.2/24.5	వరంగల్	26.1/24.0
ఒంగోలు	29.8/24.9	నిజామాబాద్	26.0/23.5
ఏలూరు	29.8/24.6	మహబూబ్‌నగర్	26.0/22.5
రాజమండ్రి	29.8/24.6	ఆదిలాబాద్	26.0/21.3
తాడేపల్లిగూడెం	29.8/24.6	హైదరాబాద్	25.7/21.9
విశాఖపట్నం	29.3/26.0	రంగారెడ్డి	25.7/21.1
విజయవాడ	29.1/24.1	మెదక్	25.4/21.5

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 జనపథం
మ.12.00 ఫస్ట్ హాఫ్ ప్రైమ్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సాగరసంగమం
ఉ.09.30 నాగ ప్రతిష్ఠ
మ.12.00 చిరునవ్వుతో
సా.06.00 వాసు
రా.09.00 మృగరాజు



మూవీస్ నౌ
ఉ.09.00 డెమాలిషన్ మ్యాన్
ఉ.11.15 సిటీ లైట్స్
మ.01.00 యాంట్-మ్యాన్
సా.06.20 మ్యాన్ ఆఫ్ స్టీల్
రా.11.50 సూపర్‌మ్యాన్ 2




హెచ్‌బీవో
ఉ.07.21 10.000 బి.సి.
ఉ.09.20 ద గాడ్‌ఫాదర్
మ.12.29 ద హ్యాంగోవర్-2
సా.04.15 ద డార్క్ నైట్ రైజెస్
రా.07.16 ఫైనల్ డెస్టినేషన్ 5



స్టార్ మూవీస్
ఉ.06.45 గాడ్జిల్లా
మ.01.17 లైఫ్ ఆఫ్ పై
సా.06.18 స్పైడర్ మ్యాన్ 2
రా.09.00 టామ్ యమ్ గూంగ్
రా.11.18 ఇండిపెండెన్స్‌డే



మా మూవీస్
ఉ.07.00 తీన్‌మార్
ఉ.09.00 మొదటి సినిమా
మ.12.00 అసాధ్యుడు
మ.03.00 కాయ్ రాజా కాయ్
సా.05.00 ఒక లైలాకోసం



జీ సినిమా
ఉ.04.45 బిన్ బులాయే బరాతి
ఉ.09.57 మైనే ప్యార్ కియా
మ.02.13 లింగా
సా.05.29 వీర్
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2



గ్రామీణ డాక్ సేవక్‌లకు కనీస వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ డాక్ సేవకులకు కనీస వేతనాలు చెల్లించి వారి సంక్షేమం కోసం పాటుపడాలని కడప డివిజన్ పోస్టల్ ఉద్యోగుల మహిళా విభాగం అధ్యక్షురాలు పి. సాయి ప్రసన్న పేర్కొన్నారు. గ్రామీణ డాక్ సేవకులు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 5 రోజుల నుంచి గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పోస్టల్ ఉద్యోగుల న్యాయమైన కోరికలు నెరవేర్చాలన్నారు. వెట్టి చాకిరి చేయించుకుంటూ సరైన వేతనాలు చెల్లించడం లేదని, ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడవ వేతన పే కమిషన్ రిపోర్టును ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ డాక్ సేవకుల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదన్నారు. మహిళా ఉద్యోగులు పద్మావతి, మంగళ గౌరి, రెడ్డెమ్మ, అరుణ, ఉమాదేవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై యువకుల రాళ్ల దాడి

ట్రంకు రోడ్డులో ఉద్రిక్తత

కడప అర్బన్ :

కడప నుంచి విజయవాడకు వెళుతున్న కడప డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సుపై మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు రాళ్లతో దాడిచేశారు. రాత్రి 11 గంటల సమయంలో ట్రంకురోడ్డులో జరిగిన ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కడప ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు (సర్వీసు నం: 50041)విజయవాడకు బయలుదేరింది. బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన వెంటనే రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనం (ఏపీ04బీహెచ్ 3359)లో ముగ్గురు యువకులు సైలెన్సర్ తొలగించి పెద్దశబ్దంతో బస్సును క్రాస్ చేస్తూ ప్రయాణికులకు ఆందోళన కలిగించారు. బస్సు ట్రంకు రోడ్ చేరుకునేప్పటికీ మద్యంమత్తులో ఉన్న యువకులు రాళ్లతో దాడి చేశారు. ప్రయాణికులు హాహాకారాలు చేయడంతో డ్రైవర్ ఏసురత్నం బస్సును నిలిపేశారు. ప్రయాణికులందరూ ఒక్కసారిగా కిందకు దిగి పారిపోతున్న యువకులను వెంటాడి పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించేందుకోసం ముగ్గురిలో ఒకరిని బస్సు ఎక్కించే ప్రయత్నం చేశారు. పారిపోయిన ఇద్దరు ఐదు నిమిషాల్లో మరో పదిమందిని వెంటేసుకుని సంఘటన స్థలానికి చేరుకుని మరోసారి దాడి చేసే ప్రయత్నం చేశారు. దీంతో ప్రయాణికులు, యువకుల మధ్య ఘర్షణ జరిగింది.సమాచారం జిల్లా పోలీసు అధికారి అట్టాడ బాబూజీకి తెలియడంతో ఆయన పోలీసులను సంఘటన స్థలానికి పంపారు. మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీసుల మీద కూడా తిరుగుబాటు చేసి తాము ఒక పోలీసు అధికారి బంధువులమంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంకురోడ్డులో ఉద్రిక్తత నెలకొంది. చుట్టుపక్కల వారు రోడ్లపైకి వచ్చారు. డ్రైవర్ ఏసురత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు ఎట్టకేలకు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అధికారులు అద్దాలు పగిలిన బస్సును డిపోనకు తరలించి మరో బస్సులో ప్రయాణికులను విజయవాడకు పంపించే ఏర్పాట్లు చేశారు.



దాడికి గురైన విజయవాడ బస్సు ఇదే..

జాతీయ విపత్తు శిక్షణకు మేజర్ విజయభాస్కర్



వైవీయూ : ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో జాతీయ విపత్తుపై నిర్వహించనున్న శిక్షణకు జిల్లాకు చెందిన మేజర్ సి. విజయభాస్కర్ ఎంపికయ్యారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి 30 ఆంధ్రా బెటాలియిన్ కడప నుంచి మేజర్ సి. విజయభాస్కర్‌ను ఎంపిక చేశారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి.. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎలా అధిగమించాలన్న అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. కాగా మేజర్ సి. విజయభాస్కర్ ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజంపేటలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రాజ్ సంతోషం వ్యక్తం చేశారు.

ఈయూ నేతలుగా శేఖర్, రాములు ఎన్నిక

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కడప రీజినల్ అధ్యక్షునిగా పీసీ శేఖర్‌ను, కడప డిపో అధ్యక్షునిగా ఇ.రామును యూనియన్ నేతలు, కార్మికులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జోనల్‌స్థాయి శిక్షణ తరగతుల్లో రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు ఆధ్వర్యంలో కార్మికులు చేయాల్సిన పోరాటాలు, బాధ్యతల గురించి వివరించారు. ఈ క్రమంలో కడప రీజినల్ అధ్యక్షునిగా శేఖర్‌ను, కడపడిపో అధ్యక్షునిగా రామును ఎన్నుకున్నారు.

‘వైష్ణవి’లో క్యాంపస్ ఇంటర్వ్యూలకు స్పందన

వైవీయూ : కడప నగరంలోని శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు చక్కటి స్పందన లభించింది. ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు దాదాపు 150 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరికి మూడుదశల్లో ఎంపికలు నిర్వహించి 12 మంది ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్, సాఫ్ట్‌స్కిల్స్‌లో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు.

ధన్వంతరి ఆధ్వర్యంలో బ్రాహ్మణ వివాహ వేదిక

కడప సెవెన్ రోడ్స్ : కడప నగరం మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ధన్వంతరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అబ్బాయిలు, అమ్మాయిల తల్లి దండ్రులు హాజరయ్యారు. కడప బ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్, బ్రా హ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు పీవీ ఎస్‌వీ ప్రసాదరావు, కార్యదర్శి రఘునాథ్, రాష్ట్ర కమి టీ సభ్యురాలు గాయత్రి, బ్రాహ్మణ సంఘం నాయకులు అతిథులుగా హాజరయ్యారు. పరి స్థితుల నేపథ్యంలో బ్రాహ్మణులు శాఖా బేధాలు విడనాడి మంచి సంబంధాలు చూసుకోవాలన్నారు. ఫౌండేషన్ జిల్లా ప్రతినిధులు పి. శ్రీనివాసులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు



చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తదితరులు

కడప కార్పొరేషన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, కమలాపురం ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్రనాథ్‌రెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో నిర్వహించుకోవాలని, రాజకీయాల్లో ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

సంధ్యా సర్కిల్‌లో...కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక సంధ్యా సర్కిల్‌లో వైఎస్ఆర్ సీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వల్లూరు జెడ్పీటీసీ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి, సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి అరుణమ్మలు హాజరై కేక్ కట్ చేశారు.

ఎన్ఆర్ఐల శుభాకాంక్షలు

పుట్టిన రోజు సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డికి వైఎస్ఆర్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐలు శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనకు వారు పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు బి. నిత్యానందరెడ్డి, బాబు, డిష్ జిలాన్, జీఎస్ బాబూరాయుడు, జరుగు రాజశేఖర్‌రెడ్డి, కరిముల్లా, పసుపులేటి మనోజ్ పాల్గొన్నారు.

చౌడమ్మ వృద్ధాశ్రమంలో...

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ రెడ్డి 57వ జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు యం. చంద్రశేఖర్ రెడ్డి, 9వ డివిజన్ ఇన్‌చార్జ్ మల్లికార్జున, కిరణ్ సబ్ జైల్ సమీపంలో చౌడమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు.

హాస్య బ్రహ్మ పద్మనాభంకు ఘన నివాళి

సింహాద్రిపురం: హాస్యనటుడు, బహు ముఖ ప్రజ్ఞాశాలి బసవ రాజు పద్మనాభం 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఆదివారం సింహాద్రిపురంలో పద్మనాభం సోదరుడు అలనాటి నిర్మాత పురుషోత్తమరావు నివాసంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమరావు మాట్లాడుతూ పద్మనాభం సింహాద్రిపురం వాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. వెండి తెరపై హాస్యాన్ని పండించి, చిత్ర రంగంలో ధ్రువతారగా నిలిచిన్న మహోన్నత వ్యక్తి పద్మనాభం అని కొనియాడారు. మొదటి చిత్రం మాయలోకం నుంచి చివరి చిత్రం భద్ర వరకు ప్రతి సినిమాలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా నటించారన్నారు. నటుడిగా, నిర్మాతగా తెలుగు ప్రేక్షకులను అలరించారని ప్రశంసించారు. ఎన్టీఆర్‌ హీరోగా దేవత చిత్రాన్ని నిర్మించడంతో పాటు పొట్టి ప్లీడర్‌, శ్రీరామ కథ సినిమాలకు దర్శకత్వం వహించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆయన కుమారుడు ఆనందరావు, కుమార్తె కుసుమకుమారి, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

‘ఆ చానల్‌ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి’



సీఐకి ఫిర్యాదు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : ఓ ప్రైవేటు చానల్‌ యాజమాన్యంపై తక్షణమే కేసు నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు తాలూకా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు తరిమెన శ్రీనివాసమూర్తి ఆచారి, ప్రధాన కార్యదర్శి గొడ్లవీటి నాగరత్నాచారి, కోశాధికారి ఉత్తరాది వెంకటరమణాచారి ఆదివారం అర్బన్‌ పోలీస్‌స్టేషన్‌ సీఐ సదాశివయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 12న రాత్రి 8.30 గంటలకు ఓ ప్రైవేటు టీవీ చానల్‌లో వెలిప్రేమ అనే ప్రోగ్రాం టెలికాస్ట్‌ అయిందన్నారు. ఇందులో విశ్వబ్రాహ్మణులకు, హిందువులకు ఆరాధ్య దైవమైన కాలజ్ఞానకర్త మద్విరాట్‌ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని, ఆయన మనమరాలు జగన్మాత ఈశ్వరదేవి అమ్మవారి గురించి తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. అలాగే విశ్వబ్రాహ్మణ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. వెంటనే ఆ చానల్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు లక్కోజి శివలింగాచారి, కమ్మర సుబ్రమణ్యం ఆచారి, బండికట్ల నాగభూషణం ఆచారి, సరాబు వెంకటనరసింహ ఆచారి, ప్రొద్దుటూరు ధనుంజయ ఆచారి, ఉపాధ్యక్షులు కమ్మర మల్లికార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌ స్కూల్‌ విధానంతో మేలు

జమ్మలమడుగు : చదువుపై ఆసక్తి ఉండి పాఠశాలలకు వెళ్లలేని వారికి ప్రభుత్వం ఓపెన్‌ స్కూల్‌ను ఏర్పాటు చేసిందని ఓపెన్‌ స్కూల్‌ రాష్ట్ర సమన్వయకర్త ఆర్‌ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌ఎస్‌ఆర్‌ యాదవ్‌ పాఠశాల ఆవరణలో ఆటో డ్రైవర్‌, డ్వాక్రా సంఘాల మహిళలకు, నిరుద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్‌ స్కూల్‌ విధానంతో చాలామంది నిరుద్యోగులు మేలు పొందారని తెలిపారు. తొమ్మిదేళ్లుగా జిల్లాలో ఓపెన్‌ స్కూల్‌ విధానాన్ని నడుపుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతిలో 3,98,895 మంది ఓపెన్‌ స్కూల్‌లో పరీక్షలు రాయగా 2,76,843 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇక్కడ అందజేసే సర్టిఫికెట్లతో అన్ని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఓపెన్‌ స్కూల్‌ జిల్లా సమన్వయకర్త రామ సుబ్బన్న, ఎంఈఓలు చిన్నయ్య, శ్యామల, సర్పంచ్‌ జొల్లు కొండయ్య, కమాల్‌సాహెబ్‌, పొన్నారి దస్తగిరి, బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. జిల్లాలో చేనేత కార్మికుల కుటుంబాలు దాదాపు 40 వేల వరకు ఉన్నాయి. వారంతా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే చేనేతలకు ప్రోత్సాహం అందించి ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. కార్మికుల అభివృద్ధిని ఆకాంక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం.. నేల చూపులు చూస్తోంది.

మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు



చేనేతలకు

చేయూత కరువు.!

- జిల్లాలో 40 వేలకుపైగా చేనేత కార్మికులు
- ముద్ర రుణాల పేరుతో అరకొరగా రుణం
- బ్యాంకర్ల తీరుపై సర్వత్రా విమర్శలు

జమ్మలమడుగు/ జమ్మలమడుగు రూరల్ :

జిల్లాలో వెయ్యి మంది చేనేతలకు ముద్ర రుణాలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఒక్కో చేనేత కార్మికుడికి రూ. 50 వేల వరకు బ్యాంకర్లు రుణం ఇవ్వనున్నట్లు ఏడీ జయరామయ్య తెలిపారు. అయితే జిల్లాలో ఉన్న చేనేతల సంఖ్యకు.. అధికారులు మంజూరు చేస్తున్న రుణాల సంఖ్యకు వ్యత్యాసం భారీగా ఉండడంతో ప్రభుత్వ తీరుపై చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అల్లు పడుతున్న దృశ్యం

జమ్మలమడుగులోనే అత్యధికం..

జిల్లా వ్యాప్తంగా జమ్మలమడుగు, మోరగుడి, దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం గ్రామాలతో పాటు పెద్దముడియం మండలంలో బీటీ పాడు, కొండాపురం మండలంలోని దత్తాపురం, ముద్దనూరు మండలంలోని ఉప్పలూరు, యామవరం, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాలల్లో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు.

జమ్మలమడుగులో 300 మందికే రుణాలు..

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉన్న చేనేత కార్మికులకు ప్రభుత్వం ముద్ర పథకం కింద 300 మందికి మాత్రమే రుణాలు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఒక్క జమ్మలమడుగు నియోజకవర్గంలోనే దాదాపు 10వేలకు పైగా చేనేత కుటుంబాలు నివాసం ఉన్నాయి. వీరిలో కేవలం 3 శాతం మందికి మాత్రమే రుణాలను మంజూరు చేయడంపై మిగిలిన వారు మండిపడుతున్నారు.


చేనేతలంటే అంత అలుసా..?

చేనేతలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు అవసరమైన రుణం మంజూరు కోసం బ్యాంకర్లు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని చేనేత కార్మిక సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. 2015–16 సంవత్సరంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అందజేసిన క్రెడిట్‌ కార్డుల మేరకు.. ఒక్కో కార్మికునికి వ్యక్తిగతంగా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు రుణం ఇవ్వాలి. అయితే బ్యాంకర్లు మాత్రం షూరిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ. 50 వేలకు రూ.30 వేలు మాత్రమే...

చేనేత కార్మికులకు బ్యాంకు అందజేసే రుణ మొత్తంలో రూ. 20 వేలను తమ వద్దే ఉంచుకోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం రూ.50వేలు రుణం ఇవ్వాల్సి ఉండగా కార్మికుడికి రూ.30వేలను అందజేసి షూరిటీ పేరుతో రూ.20 వేలను బ్యాంకర్లు తమ వద్దే ఉంచుకుంటున్నారు. దీనికితోడు వీవర్స్‌ క్రెడిట్‌ కార్డు కలిగిన కార్మికులకు ఆరు శాతం మాత్రమే వడ్డీ వసూలు చేయాల్సి ఉంది. కానీ, బ్యాంకర్లు 12 శాతం వడ్డీ విధిస్తూ.. తమ వద్ద ఉన్న రూ. 20 వేల షూరిటీ మొత్తానికి 8 శాతం వడ్డీ మాత్రమే ఇస్తుండడంపై విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు కూడా బ్యాంకర్లకే వత్తాసుపలుకుతుండడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

బ్యాంకర్లు మోసం చేస్తున్నారు



కార్మికులకు రుణాలను పూర్తి స్థాయిలో ఇవ్వకుండా బ్యాంకర్లు వింత నిబంధనలు పెట్టి మోసం చేస్తున్నారు. బ్యాంకు అందజేసే రూ.30 వేలతో ఏవిధంగా చేనేతలు అభివృద్ధి చెందుతారో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. బ్యాంకర్లు అన్యాయంగా వ్యవహరిస్తున్నా.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం. – *బడిగించల చంద్రమౌళి,* **చేనేత కార్మిక సభ్యుడు, జమ్మలమడుగు**

రుణ మొత్తాన్ని అందజేయాలి..

చేనేత మగ్గాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రూ.50 వేలకు పైగా ఖర్చవుతుంది. అలాంటిది బ్యాంకర్లు కేవలం రూ.30 వేలు మాత్రమే ఇస్తుండడంతో ఆ మొత్తాన్ని ఏ విధంగా అభివృద్ధికి వినియోగించుకోవాలో అర్థం కావడం లేదు. ఈ విధంగా అరకొరగా రుణాలు ఇచ్చినా... ఎవ్వరికీ ప్రయోజనం ఉండదు.

– *జొల్లు కొండయ్య,* **మోరగుడి**

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రాయచోటి రూరల్ : ప్రభుత్వ పాఠశాలలను బలహీన పరిచే స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం రాయచోటి ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్న మాట్లాడారు. ప్రభుత్వ జోక్యం లేకుండా పారిశ్రామిక వేత్తలతో కొత్త ప్రైవేటు పాఠశాలల ఏర్పాటు వల్ల ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. న్యాయస్థానానికి వెళ్లే అవకాశం లేకుండా డ్రాఫ్టు రూల్స్‌ రూపొందించడం దుర్మార్గమన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటం

ప్రైవేటు విద్యా సంస్థలకు కోట్ల రూపాయల నిధులను విడుదల చేసేలా నిర్ణయాలు తీసుకోవడంపై కత్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించే వరకు రాజీ లేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు త్వరలో ఏకీకృత సర్వీసు రూల్స్‌కు అనుగుణంగా కొత్త నిబంధనలు విడుదల అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ, పీఓ పోస్టుల భర్తీపై రెండు, మూడు రోజుల్లో సమావేశం కానున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో ఉపాధ్యాయ నాయకులు రవీంద్రనాథ్‌ రెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి, సహదేవ రెడ్డి, భూషణ్‌ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుధాకర్‌, రామాంజినేయులు, శ్రీధర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తినరసింహా రెడ్డి

విభజన హామీలను నెరవేర్చాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను నెరవేర్చాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని పేర్కొన్నా పట్టించుకోవడం లేదన్నారు. శనివారం జరిగిన కేంద్ర కేబినెట్‌ సమావేశంలో 8 రాష్ట్రాలకు పదేళ్ల పాటు ప్రత్యేక హోదాను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారని... ఎన్నికల ముందు రాష్ట్రానికి ఇస్తామన్న హోదాను పక్కనపెట్టడం దారుణమన్నారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే

రాజుపాళెం : రాజుపాళెం–అయ్యవారిపల్లె రహదారి మధ్యలోని మడువంకపై తాత్కాలికంగా వేసిన రహదారి వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయింది. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వరద నీరు భారీగా ప్రవహించడంతో రహదారికి బలం చేకూర్చేందుకు వేసిన బండ రాళ్లు, కంకర కొట్టుకుపోయాయి. దీంతో ఆ దారిలో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. రాజుపాళెం నుంచి టంగుటూరుకు వెళ్లే వారంతా తొండలదిన్నె మీదుగా టంగుటూరుకు, అలాగే టంగుటూరు గ్రామస్తులు తొండలదిన్నె మీదుగా మండల కేంద్రమైన రాజుపాళెంకు చేరుకోవచ్చు. ఆర్‌అండ్‌బీ అధికారులు కాజ్‌వేపై దెబ్బతిన్న రహదారికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రాజుపాళెం-అయ్యవారిపల్లె మధ్య కొట్టుకుపోయిన రహదారి

ఎక్కడి ఎరువులు అక్కడే

- 49వేల మెట్రిక్ టన్నుల ఎరువులు గోడౌన్లలో నిల్వ
- వర్షాభావంతో తగ్గిన వినియోగం
- ఆందోళనలో రైతులు, వ్యాపారులు





గోడౌన్‌లో ఎరువులను నిల్వ చేస్తున్న కూలీలు (ఇన్‌సెట్) గూడ్స్ షెడ్‌లో వ్యాగన్ల నుంచి అన్‌లోడ్ చేస్తున్న ఎరువులు

కడప అగ్రికల్చర్ :

ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడి ఎదురు చూడాలి.. ఆ ఎరువులు అందకపోతేనో.. సరిగా పంపిణీ చేయకపోతేనే రైతులు రోడ్లపై ఆందోళనలు చేయడం.. వ్యవసాయాధికారులను నిర్బంధించడం.. కార్యాలయాలను ముట్టడించడం ఇవన్నీ గత ఖరీఫ్ సీజన్‌లో నిత్యం కనిపించే దృశ్యాలు. అయితే జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఎరువుల కొరత అనే మాటే వినపడడం లేదు. తీవ్ర వర్షాభావంతో రైతులు సాగు చేయడం లేదు. ఈ నేపథ్యంలో ఎరువులు తీసుకెళ్లేవారులేక వ్యాపారులు నిరుత్సాహంలో ఉన్నారు. మార్క్‌ఫెడ్, ప్రైవేట్ ట్రేడర్లు ఎరువులు కొనుగోలు చేయలేమని చేతులెత్తేశారు. తమకు ఎలాంటి ఇండెంట్ వద్దు బాబోయ్ అని అధికారులతో అంటున్నారు. దుకాణాల వారు ముందుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న ఎరువులను ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఖరీఫ్‌లో విత్తడానికి తెచ్చి పెట్టుకున్న ఎరువులను కూడా రైతులు తమ ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకున్నారు. ఎరువుల కొనుగోలు లేకపోవడంతో మార్కెఫెడ్, ఇతర గోడౌన్లలో ఎరువుల నిల్వలు మూలుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే కాంప్లెక్స్ ఎరువులతోపాటు యూరియా తదితరవి దొరకని పరిస్థితి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి పదును కాకపోవడంతో ఎరువులను అడిగేవారు కరువయ్యారు. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, పత్తి సాగు బాగా తగ్గింది. జిల్లాలో అన్ని పంటలు కలిపి 1.36 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, కేవలం 60,335 హెక్టార్లలోనే సాగయ్యాయి.

75 శాతం తగ్గిన ఎరువుల విక్రయాలు..

సాధారణంగా ఈ పాటికి పంటల సాగు ఊపందుకుని ఎరువుల కొరత తలెత్తి ఉండాలి. జూన్ ప్రారంభంలో విత్తనాలు వేసిన అనంతరం కలుపులు తీసి పై పాటుగా ఎరువులను వేస్తూ, రెండో విడత పంటల సాగును రైతులు చేపడితే ఎరువులు అందించడం భారంగా ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితి తారుమారైంది. ఖరీఫ్‌కు జిల్లావ్యాప్తంగా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఇప్పటికే 62 వేల మెట్రిక్ టన్నులు ఎరువులను నిల్వ చేశారు. ఇందులో కేవలం 13 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అమ్ముడుపోయాయని అధికారులు అంటున్నారు. దీంతో ఈ సారి ఎరువుల వినియోగం దాదాపు 75 శాతం తగ్గిందని అధికారులు అంచనాలు వేశారు.

జిల్లాలో ఎరువుల విక్రయం..

ఎరువు రకం	జిల్లాలో విక్రయించిన ఎరువులు (మె.టన్నుల్లో)
యూరియా	5000
డీఏపీ	2000
ఎంఓపీ	2000
కాంప్లెక్స్	4000
మొత్తం	13,000

మార్క్‌ఫెడ్‌లో నిల్వలు..

ఎరువులు నిల్వ ఉంచడం, అవసరం మేరకు పీఏసీలకు సరఫరా చేయడం మార్క్‌ఫెడ్ బాధ్యత. ఇప్పటికే కొనుగోలు చేసి ఉంచిన నిల్వలు గోడౌన్లలో పేరుకుపోయాయి. గోడౌన్లు నిండిపోతుండడంతో ఎక్కడ పెట్టాలో దిక్కుతోచడం లేదని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు లూద్రారెడ్డి తల పట్టుకుంటున్నారు. కొన్ని ఎరువులు గోడౌన్లలో గడ్డ కట్టుకుపోయాయి. వీటిని విక్రయించాలంటే తల ప్రాణం తోకకొస్తోంది.

ఎరువుల విక్రయాలు బాగా తగ్గాయి..



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షాభావంతో ఆశించిన మేర ఎరువుల విక్రయాలు ఊపందుకోలేదు. కేసీ కెనాల్ కింద ఈ పాటికి ముమ్మరంగా నాట్లు వేయడానికి రైతులు సిద్ధపడాల్సి ఉండేది. కానీ ఇంతవరకు శ్రీశైలం డ్యాంలో నీళ్లులేవని అధికారులు చెబుతున్నారు. నీరు వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. – మధుసూదనరెడ్డి, అధ్యక్షుడు, జిల్లా ఫెర్టిలైజర్స్ అసోషియేషన్, కడప

నిల్వ పేరుకు పోయిన మాట వాస్తవమే..

జిల్లాకు రావాల్సిన ఎరువులు నిత్యం కంపెనీల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే ఎరువుల గోడౌన్లు నిండిపోయాయి. ఈ ఖరీఫ్‌కు 22 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి. గతేడాది ఎరువులు 40 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఇప్పటికి కేవలం 13 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అమ్ముడుపోయాయి.
– డీ ఠాకూర్ నాయక్, జేడీ, జిల్లా వ్యవసాయశాఖ

వైవీయూ సీడీసీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎఫ్ నగర కన్వీనర్ గంగరాజు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు అనుమతులిచ్చే క్రమంలో వైవీయూ సీడీసీ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడతున్నారని.. వీటన్నింటిపైనా విచారణ చేపట్టాలని రాయలసీమ విద్యార్థి వేదిక నగర కన్వీనర్ గంగరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ఐటీఐ సర్కిల్‌లోని తమ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు కళాశాలల్లో కనీస వసతులు లేకపోయినప్పటికీ వాటికి గుర్తింపునివ్వడంలో ఆంతర్యమేమిటన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు వ్యతిరేకండా ఉన్నవాటి గుర్తింపు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు మహేష్, రూపేష్, శ్రీకాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో సీఎంకు ఘనస్వాగతం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాలలో ఎన్నికల క్యాంపెన్ ముగించుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఆదివారం సాయంత్రం కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాబూరావు నాయుడు, ఎస్పీ బాబూజీ, ఆర్డీఓ చిన్నరాముడు, టీడీపీ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి, వల్లూరు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

బాలుడిని అప్పగించిన పోలీసులు

– దొరికిన మూడు గంటల్లోనే తల్లి దరికి చేర్చిన ఎస్ఐ



తల్లి నసీమూన్‌కు ఖాజాపీర్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డి

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని చెన్నూరు టోల్ ప్లాజా వద్ద శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో హైవే పెట్రోలింగ్ సిబ్బందికి ఐదేళ్ల ఖాజాపీర్‌ను కనిపించాడు. అనంతరం ఈ బాలుడ్ని తాలూకా పోలీసులకు అప్పగించారు. ఖాజాపీర్ చెప్పిన మేరకు తాలూకా ఎస్ఐ ఎన్ రాజరాజేశ్వర రెడ్డి సిబ్బందితో అంగడి వీధిలో విచారించారు. అయినా ఆచూకీ లభించక పోవడంతో స్థానికులకు ఫోన్ నంబర్, వివరాలను తెలిపారు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో బాలుడి తల్లి నసీమూన్ వచ్చి పోలీసులతో తన కుమారుడి గురించి ఆరా తీసింది. తగిన ఆధారాలు తెలుపడంతో ఎస్ఐ ఆ బాలుడ్ని తల్లికి అప్పగించారు. తన బిడ్డను అప్పగించడంతో ఆమె హర్షం వ్యక్తం చేసింది.

ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో కేంద్రానికి చిత్తశుద్ధిలేదు



సంఘీభావం తెలుపుతున్న రాయలసీమ దివ్యాంగుల రాష్ట్ర కార్యదర్శి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో కేంద్రానికి చిత్తశుద్ధిలేదని రాయలసీమ ది వ్యాంగుల రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, పీఆర్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ ఆర్‌సీపీ చేస్తున్న వంద రోజుల దీక్షలో భాగంగా ఆదివారం 45వ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'కడప ఉక్కు–రాయలసీమ హక్కు' అనే నినాదంతో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. విభజన చట్టంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అన్ని ఖనిజాలు ఉన్న సీమ ప్రాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించకోకుండా వివక్ష చూపడం సరికాదన్నారు. అంగవైకల్యం శరీరాలకు తప్ప పోరాటాలకు కాదన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆదివారం దీక్షలో శైలజ, చింతల రాయుడు, సత్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌ఫెడ్ బకాయిలు చెల్లించాలి



తనఖా పత్రాలను అందజేస్తున్న ఏపీ హౌస్‌ఫెడ్ రీజినల్ మేనేజర్ బీ గుర్రప్ప

కడప అగ్రికల్చర్ : సహకార గృహ నిర్మాణ సంఘాల సభ్యులు సంస్థ నుంచి తీసుకున్న రుణ బకాయిలను చెల్లించి తనఖా పత్రాలను పొందాలని ఏపీ హౌస్‌ఫెడ్ రీజినల్ మేనేజర్ బీ గుర్రప్ప తెలిపారు. నగరంలోని హౌస్‌ఫెడ్ కార్యాలయంలో ఆదివారం బకాయి చెల్లింపుల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ ఏపీ హౌస్‌ఫెడ్‌కు జీవిత బీమా సంస్థ, అలహాబాద్ బ్యాంకు నుంచి రుణం పొందిన ప్రతి సభ్యుడు తమ బకాయిలు సక్రమంగా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తే అపరాధపు వడ్డీ ఉండదని పేర్కొన్నారు. వాయిదా మీరిన బకాయిదారుల, మొండి బకాయిదారుల స్థిర చరాస్తులు జప్తు, వేలం వంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిదారులు ఏపీ హౌస్‌ఫెడ్ హైదరాబాదు భారతీయ స్టేట్ బ్యాంకు అకౌంట్ నంబరు 52196403533కు ఆన్‌లైన్ ద్వారా నేరుగా జమ చేసి వివరాలను ప్రాంతీయ కార్యాలయం కడప వారికి తెలియజేయాలన్నారు. జిలల్లాలో 31 సంఘాల నుంచి రూ.350.27 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఎలాంటి బకాయిలు లేనివారికి మళ్లీ కొత్త రుణాలు ఇస్తామన్నారు. అనంతరం బకాయి చెల్లించిన వారికి తనఖా పత్రాలను అందజేశారు.

పర్యాటకంపై పెరుగుతున్న ఆదరణ



మాట్లాడుతున్న యలమర్తి మధుసూదన్



సమావేశంలో పాల్గొన్న పర్యాటకాభిమానులు

కడప కల్చరల్ : పర్యాటక రంగంపై రాష్ట్రంలో ఆదరణ పెరుగుతోందని, దీన్ని ముఖ్య ఆదాయ వనరుగా ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ప్రముఖ కవి, సంగీత దర్శకులు, పర్యాటక ప్రముఖులు యలమర్తి మధుసూదన్ పేర్కొన్నారు. కొండూరు పిచ్చమ్మ వెంకట్రాజు స్మారక సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'నెలనెల మన జిల్లా పర్యాటక ప్రాంతం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాకు పౌరాణికంగా, చారిత్రకంగా, సాహిత్య పరంగా ఎంతో విశిష్టత ఉందని సోదాహరణంగా వివరించారు. అలాగే దేవుని కడప క్షేత్రం విశిష్టత, స్థల పురాణం, చారిత్రక అంశాలు, జిల్లా ప్రత్యేకతలు వివరించారు. జిల్లాలో సాహిత్య వైభవాన్ని కూడా తెలిపారు. అన్నమయ్య కడప రాయునిపై రాసిన కీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథి పర్యాటకం (సిద్దవటం) సీతారామయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనన్ని విశిష్టతలుగల పర్యాటక ప్రాంతాలు మన జిల్లాలో ఉన్నాయన్నారు. అయితే వాటి పట్ల, పర్యాటక రంగం పట్ల అవగాహన లేకపోవడంతోనే నేటికీ ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు, కళాశాల చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో పర్యాటక రంగంపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో పర్యాటక రంగానికి మంచి ఆదరణ ఉంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొండూరు జనార్ధన్‌రాజు పర్యాటక రంగంలో తమ భవిష్య కార్యక్రమాల గురించి వివరించారు. రచయితలు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది విజయభాస్కర్, తవ్వా ఓబుల్‌రెడ్డి, డాక్టర్ శివపార్వతి, వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ సాయిప్రసాద్, యల్లేశ్వరావు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఈ ఏడాది నుంచి పరీక్షల్లో అమలు చేస్తున్న సెమిస్టర్ విధానం పట్ల విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని ఆ యూనివర్సిటీ విద్యార్థి విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయక్రిష్ణారెడ్డి అలియాస్ ఎల్వీకే తెలిపారు. సెమిస్టర్ విధానం విద్యార్థులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సార్వత్రిక విశ్వవిద్యాలయాల విభాగంలో దేశంలోనే సెమిస్టర్ విధానానికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తొలిసారిగా శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. ఎల్వీకే ఆదివారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన పలు విషయాలను విలేకరులకు వెల్లడించారు. ఈసందర్భంగా 'సాక్షి'కి ఎల్వీకే ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. - రాజంపేట టౌన్



సాక్షి ఇంటర్వ్యూ

సెమిస్టర్ విధానంపై
ఆందోళన వద్దు

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే

సాక్షి : సెమిస్టర్ విధానం వల్ల ప్రయోజనమేంటి?

జవాబు: సెమిస్టర్ విధానం వల్ల ఆరు నెలలకోమారు పరీక్షలు జరుగుతాయి. ఇందువల్ల సిలబస్ తక్కువగా ఉంటుంది కనుక విద్యార్థులు పాఠ్యాంశాన్ని లోతుగా అధ్యయనం చేసేందుకు వీలవుతుంది. ఫలితంగా విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కాగలరు. ఈఏడాది డిగ్రీ కోర్సులతో పాటు ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ కోర్సు పరీక్షలు కూడా సెమిస్టర్ విధానంలోనే జరుగుతాయి.

సాక్షి : సెమిస్టర్ విధానానికి తగ్గట్లు సిలబస్‌లో మార్పులు చేస్తున్నారా?

జవాబు: సెమిస్టర్ విధానాన్ని దృష్టిలో ఉంచుకోవడంతో పాటు విద్యార్థులు ఉపాధి అవకాశాలను పొందేలా యూనివర్సిటీ సిలబస్‌ను రూపొందిస్తుంది. అలాగే విద్యార్థులు సాఫ్ట్‌స్కిల్స్ పెంపొందించుకునేలా కోర్సులను ప్రవేశ పెడుతున్నాం.

సాక్షి : కొత్త కోర్సులు ఏవైనా ప్రవేశ పెడుతున్నారా?

జవాబు: విద్యార్థులు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టేదిశగా ఆలోచిస్తున్నాం. ఇందులో భాగంగా వివిధ సంస్థలతో చర్చలు జరుపుతున్నాము. ప్రస్తుతం ఉపాధి అవకాశాలను పొందేందుకు ఫోటోగ్రఫీ, స్కిల్ డెవలప్‌మెంటు కోర్సులు తమ యూనివర్సిటీలో ఉన్నాయి.

సాక్షి : ఈ ఏడాది మీ యూనివర్సిటీలో చేరేందుకు గడువు ఉందా?

జవాబు: డిగ్రీలో ప్రవేశానికై తాము రెండవసారి నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు కూడా ఇటీవలే విడుదలయ్యాయి. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశించే వారితో పాటు ఏంఏ, ఏంకాం, ఎంఎస్సీ, బీఈడీ, పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 24వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అర్హులైన వారు అడ్మిషన్ పొందవచ్చు.

సాక్షి : జిల్లాలో ఓపెన్ యూనివర్సిటీకి ఎలాంటి స్పందన ఉంది?

జవాబు: వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చాలామంచి స్పందన ఉంది. జిల్లాలో 12 స్టడీ సెంటర్లు ఉన్నాయి. నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

సాక్షి : మీ యూనివర్సిటీ ద్వారా ఎవరైనా ఉన్నత స్థాయికి వెళ్లారా?


జవాబు: ఇటీవల వెల్లడైన సివిల్ సర్వీస్‌సెస్ ఫలితాల్లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి అయిన బిందు మాధవ్ గరికపాటి 172వ ర్యాంకు సాధించారు. సాంప్రదాయ కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా తమ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభాపాటవాలు చూపుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది తమ యూనివర్సిటీలో చదివిన వారు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు.



పొద్దుటూరులో వినాయకుడి విగ్రహాన్ని మట్టితో తయార

మట్టి గణపయ్యకు
జై..బోల

పొద్దుటూరులో మట్టి విగ్రహాల తయారీ





పొద్దుటూరులో మట్టి విగ్రహాలను సహజ రంగులతో ముస్తాబు చేస్తున్న దృశ్యం

పర్యావరణానికి మేలు ...



మట్టి గణపయ్యలు పర్యావరణానికి ఎంతో మేలు. ఎలాంటి హానికరమైన రంగులు వాడకుండా మట్టి, దబ్బలు, చెత్తతో తయారు చేస్తాం. ఐదున్నర అడుగుల వినాయక విగ్రహాన్ని తయారు చేయడానికి ఐదు రోజులు పడుతుంది. మున్సిపల్ అధికారులు, కొందరు యువకులు, స్వచ్ఛంద సంస్థల వారు మట్టితో తయారు చేసే పెద్ద విగ్రహాలను ఆదరిస్తున్నారు.

- రామకృష్ణ, తయారీదారుడు, కుమ్మరికొట్టాల, ప్రొద్దుటూరు.

ప్రొద్దుటూరు కల్చరల్ :

వినాయక చవితి వచ్చిందంటే చాలు బొజ్జ గణపయ్యలను వాడవాడలా కొలువు దీరుస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.. అందువల్ల పర్యావరణ ప్రేమికులు మట్టితో తయారు చేసిన విగ్రహాలకే జై కొడుతున్నారు.

- పట్టణంలోని కుమ్మరికొట్టాలలో దాదాపు 10 కుటుంబాలు దాకా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. మిగతా సమయంలో వీరు కుండలు, హుండీలు, దీపపు సెమ్మెలను తయారు చేస్తుంటారు.
- మట్టిని కడప, మైదుకూరు నుంచి తీసుకువచ్చి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒకలోడు మట్టి దాదాపు 6 వేల రూపాయలు ఖర్చవుతుందని తయారీదారులు అంటున్నారు. వినాయక చవితికి 3 నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తారు. మట్టి పిసికి అచ్చుల్లో వేసి వినాయక విగ్రహాలను తయారు చేసి ఆరబెడతారు. తర్వాత వాటికి సహజ రంగులతో అందంగా తీర్చిదిద్దుతారు.
- అర అడుగు నుంచి రెండు అడుగుల మేర విగ్రహాలను తయారు చేసి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.







...ు చేస్తున్న దృశ్యం

...వితి వేడుకలకు సిద్ధం



చవితి పండుగకు విక్రయాలకు సిద్ధం చేసిన మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు



30 ఏళ్లుగా...

...మట్టితో తయారు చేసిన ...న్న వినాయక విగ్రహాలను ...0 ఏళ్లుగా విక్రయిస్తున్నాం. ...డుగ మూడు నెలల ముందు ...ంచే విగ్రహాలను తయారు ...స్తున్నాం. మట్టి విగ్రహాలకు ఆదరణ బాగా ఉంది.

...క్షుమ్మ, తయారీదారురాలు, కుమ్మరికొట్టాల, ప్రొద్దుటూరు

కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ కుడ్యాలపై అలరిస్తున్న నృత్య గణపతి

ఏకదంతాయ... బహురూపాయ

▲ అరుదైన గణనాథుల విగ్రహాలతో అలలారుతోన్న పుష్పగిరి
▲ అద్భుత శిల్పకళకు నిలయం

పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి అరుదైన, విభిన్న గణనాథులతో అలలారుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఆలయ గోడలపై వివిధ రకాల శిల్పాలు ఉన్నా వినాయకుడి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయ కుడ్యాలపై వివిధ భంగిమల్లో ఉన్న వినాయకులు కనిపిస్తారు. విభిన్న గణపతులను ఒకే చోట దర్శించుకోవాలంటే మనం తప్పక పుష్పగిరిని సందర్శించాల్సిందే. వినాయక చవితి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

– పుష్పగిరి (వల్లూరు)






సిద్ధి వినాయకుడు



మూషిక వాహనంపై పయనిస్తున్న వినాయకుడు



వైద్య నాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని నృత్య గణపతి



మూషికంపై వినాయకుడు

అరుదైన నృత్య గణపతి

పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ బాహ్య కుడ్యంపై అరుదైన నృత్య గణపతి శిల్పం మనోహరంగా కనిపిస్తుంది. ఎడమ వైపున గల చేతిలో పాశంకు బదులుగా తన తండ్రి కంఠాభరణంగా కనిపించే సర్పాన్ని చేత పట్టి కుడి కాలును నేలను తాకిస్తూ ఎడమ కాలును పైకి లేపి నృత్యం చేస్తూ కనిపిస్తాడు.

పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణలో వున్న శిల్ప సంగ్రహాలయంలో కూడా నృత్య గణపతి ముగ్ధ మనోహరంగా దర్శనమిస్తున్నాడు.

పాతాళ గణపతి

కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయానికి అభిముఖంగా పెన్నా నది ఒడ్డున పుష్పగిరిలో శ్రీ పాతాళ గణపతి ఆలయం వుంది. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగి శిథిలావస్థలో వున్న ఈ ఆలయాన్ని పురోహితులు రమణమూర్తి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాల క్రితం పునరుద్ధరించి పూజలు కొనసాగిస్తున్నారు. పేరుకు తగ్గట్లే ఈ ఆలయంలోని గణనాథుడు భూమి లోపల దర్శనమిస్తాడు. ఈ వినాయకునికి పూజలు చేయాలంటే మనం తప్పని సరిగా కొన్ని మెట్లు భూమిలోపలికి దిగాల్సిందే. పుష్పగిరికి వచ్చే ప్రతి భక్తుడు మొదట ఈ గణపతిని దర్శించుకున్న తరువాతనే ఇతర ఆలయాల్లోని మూర్తులను దర్శించుకొనే ఆనవాయితీ ఉన్నట్లు చారిత్రకాధారాలు వున్నాయని పండితులు పేర్కొంటున్నారు. ఈ వినాయకుని డుండి వినాయకుడిగా కూడా పిలుస్తారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ కాళహస్తిలో మాత్రమే ఇలా భూమిలోపల వున్న గణనాథున్ని మనం దర్శించుకోవచ్చునని పండితులు తెలుపుతున్నారు.

మూల స్థానంలో గణపతి

సాధారణంగా శివుని ఆలయాల్లో మూల స్థానంలో శివుడు వుంటే వినాయకుడు గుడిలోని ఏదో ఒక వైపున వుండడం సహజం. కానీ పుష్పగిరి కొండపైన గల శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి ఆలయంలో మూల స్థానంలో వున్న తన తండ్రి మూల విరాట్‌కు వెనుక వైపునే కొలువుదీరి దర్శనమివ్వడం ప్రత్యేకత సంతరించుకుంది.

మూషిక వాహనంపై గణపతి

తన వాహనమైన మూషికం (ఎలుక) పై కూర్చుని స్థిరంగా వున్న గణనాథుడు మనకు ప్రతి చోట దర్శనమివ్వడం సర్వ సాధారణం. కానీ పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ కుడ్యాలపై మూషిక వాహనంపై పయనిస్తున్న వినాయకులను మనం వీక్షించవచ్చు.



కురిసింది వాన

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కడప నగరంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఒక్క సారిగా మేఘాలు కమ్ముకొని వాన కురవడంతో పాదచారులు, వాహన చోదకులు, తోపుడు బండ్ల వ్యాపారులు, షాపింగ్‌కు వచ్చిన మహిళలు, పిల్లలు తడిసి ముద్దయ్యారు. వర్షంవల్ల లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. – కడప కార్పొరేషన్



అగ్ని విన్యాసం..

ఆదివారం ఉల్లాసంగా... ఉత్సాహంగా ప్రజలు గడిపారు. ఉదయం ప్రొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి సర్కిల్‌లో మున్సిపల్ అధికారులు హ్యాపీ సండే కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. జానపద గేయాలాపనతో అలరించారు. దీంతో పుట్టపర్తి సర్కిల్‌లో సందడి నెలకొంది. అగ్ని విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. - ప్రొద్దుటూరు టౌన్

ధర్మాస్పత్రుల్లో అధర్మ పాలన

మొదటిపేజీ తరువాయి

జరుగుతోందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. మొత్తం మీద ఎప్పటినుంచో వైద్య విధానం గాడి తప్పిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలోని ఆస్పత్రులు

కడపలో ప్రధాన ఆస్పత్రి రిమ్స్ ఉంది. ఈ ఆస్పత్రిలో 24 గంటలు నిరంతరాయంగా వైద్య సేవలను అందించాలి. వైద్య విధాన పరిషత్‌లో ఒకటి ప్రొద్దుటూరులో జిల్లా ఆస్పత్రి, పులివెందులలో ఏరియా ఆస్పత్రితోపాటు 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 3, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 9, మొత్తం 14 హాస్పిటల్స్ ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా 24 గంటలు పనిచేయాలి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 75 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 448 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇవి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందిస్తాయి.

సిబ్బంది ఇష్టారాజ్యం

కాగా, ఈ హాస్పిటల్స్‌లోని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కడపరిమ్స్ తర్వాత వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని ఆస్పత్రులు కీలకంగా మారాయి. ఎందుకంటే రిమ్స్ తర్వాత ఇవి దాదాపుగా 24 గంటలు వైద్య సేవలను అందించాలి. ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో ఇటీవల జరిగిన సంఘటన అందరికీ తెలిసిందే! ఇంకా అక్కడ ఎన్నో లోపాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అలాగే రాజంపేటలో చీకటిపడితే వైద్యం అందని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నలుగురికిగాను ముగ్గురు డాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారు. సాయంత్రం పూట ఏవైనా కేసులు వస్తే అక్కడిసిబ్బంది కడపకు రెఫర్ చేస్తున్నారు. అలాగే మైదుకూరు ఆస్పత్రి పరిస్థితి కూడా అధ్వాన్నంగా మారింది. అక్కడ ఒక ఫార్మసిస్టును ఏడాది క్రితం సస్పెండ్ చేశారు. ఇంతవరకు ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇదీ 30 పడకల హాస్పిటల్. ఆరుగురికిగాను నలుగురు మాత్రమే వైద్యులు పనిచేస్తున్నారు. గతంలో నెలకు ఇక్కడ 60 కాన్పులు జరిగేవి. ఇప్పుడు మహా అంటే 13కూడా జరగని పరిస్థితి ఏర్పడింది. కాగా జమ్మలమడుగు హాస్పిటల్‌లో గైనకాలజిస్టుల కొరత ఉంది. చివరికి ఇక్కడ ఒక మత్తు ఇంజెక్షన్ ఇచ్చే వైద్యుడు కూడా లేకపోవడం దారుణం. ప్రధానంగా దాదాపుగా అన్ని హాస్పిటల్‌లో జబ్బుకో రేటును నిర్ణయించారు. ముఖ్యంగా ప్రసవాలకు సంబంధించి మగపిల్లవాడు జన్మిస్తే రూ. 3–5 వేల వరకు, అదే ఆడపిల్ల జన్మిస్తే రూ. 2–3 వేల వరకు వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంటే రూ. 40–50 వేలు కట్టాలి కదా....ఇక్కడ ఆ మాత్రమైనా ఇవ్వలేరా? అని సిబ్బంది ఎదురు ప్రశ్నిస్తున్నట్లుగా సమాచారం.

ప్రైవేటు వైద్యానికే వైద్యుల మొగ్గు

దాదాపు అన్ని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు తాము ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు వైద్యానికి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోగులు ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే అక్కడ పరీక్షించి నామమాత్రంగా వైద్య సేవలు అందించి తమ క్లినిక్‌లకు రావాలని చెబుతున్నటు తెలుస్తోంది. దీంతో సాయంత్రం పూట వైద్యం కోసం హాస్పిటల్స్‌కు వెళ్లిన వారు అక్కడ డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీయక తప్పని పరిస్థితి ఏర్పడింది. గాడి తప్పిన వైద్య విధానాన్ని సరిదిద్ది ధర్మాస్పత్రుల్లో ధర్మ పాలన జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పండిట్ల వ్యవస్థ రద్దే శాశ్వత పరిష్కారం

కడప ఎడ్యుకేషన్: ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపకల్పనలో ఎల్‌పీ వ్యవస్థ రద్దుకు కావాల్సిన నియమ నిబంధనలు రూపొందించేటట్లు ప్రభుత్వానికి విన్నవించినట్లు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. కడపలోని డీఈసీబీలో ఆదివారం ఎల్‌పీ వ్యవస్థ రద్దు గురించి భాషోపాధ్యాయ సంస్థ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎస్‌ఎల్‌టీఏ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి హాజరై మాట్లాడారు. ఎస్‌ఎల్‌టీ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ పండిట్ల అప్‌గ్రెడేషన్, ఏకీకృత సర్వీస్ నిబంధనలు సాధించిన ఒంటేరు నిబద్ధత, కృషిని కొనియాడారు. ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానంద రెడ్డి మాట్లాడుతూ భవిషత్తులో ఎల్‌పీ వ్యవస్థ



సమావేశంలో మాట్లాడుతున్న ఓంటేరు శ్రీనివాసులరెడ్డి

పూర్తి రద్దు అయ్యే వరకూ పోరాడనున్నట్లు చెప్పారు. రాష్ట్ర కోశాధికారి బోగా గంగాధర్ మాట్లాడుతూ సంస్థ పటిష్టతకు సభ్యులందరూ సహరించాలన్నారు. ఆర్‌జేయూపీ అధికార ప్రతినిధి వీరబ్రహ్మం, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎల్‌పీ వ్యవస్థ రద్దు చేయడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడి అందరికి న్యాయ జరుగుతుందన్నారు. అనంతరం సర్వీస్‌రూల్స్ సాధనకు కృషి చేసిన ఓంటేరు శ్రీనివాసలరెడ్డి, కేజీబీవీ ఉపాధ్యాయుల బృందం, ఆపాస్, ఎస్సీ,ఎస్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎల్‌టీఏ జల్లా అధ్యక్షుడు పల్లా బాస్కర్, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాష, కేఎస్‌ఎం హిందీభవన్ షర్షతుల్లా, హెచ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్,సురేంద్ర, నెతాజీ సోషల్ క్లబ్ కార్యదర్శి మిట్టా కేశవరెడ్డి, ఆపాస్‌నాయకులు, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాకిరేనిపల్లెలో కోనేటి నీరే గతి



కోనేటి నుంచి నీళ్లు తీసుకెళుతున్న గ్రామస్తులు

కాకిరేనిపల్లె(ప్రొద్దుటూరు) : మండలంలోని కాకిరేనిపల్లె గ్రామ పంచాయతీలో నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెన్నానది నుంచి ఏర్పాటు చేసిన నీటి పథకం ఉండేది. ఈ గ్రామంలో సుమారు 1000 మంది జనాభా ఉన్నారు. వారం రోజుల క్రితం నీటి పథకానికి మరమ్మతులు రావడంతో నీరు రాలేదు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. ఈ కారణంగా గ్రామంలో ఉన్న కోనేరు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.1937లో నామా ఎరుకలయ్య విశాలమైన కోనేటిని నిర్మించారు. ఈ నీటిని వ్యవసాయ, ఇతర అవసరాలకు ప్రజలు వినియోగించుకునే వారు కాదు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో గ్రామమంతా ఈ నీటిపైనే ఆధార పడి ఉంది. లోతైనా ప్రదేశంలో ఉన్న కోనేటి నుంచి గ్రామస్తులు నీరు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబును వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

తోటకూర.. లాభాల ధార

- ప్రస్తుతం సాగుకు అనుకూలం
- నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యం
- తక్కువ సమయం, కొంచెం పెట్టుబడితో అధిక ఆదాయం

కడప అగ్రికల్చర్ :

ఏటా సంప్రదాయ పంటలే కాకుండా.. రైతులు పంట మార్పిడి విధానాలతో ప్రయోగాలు చేస్తుండాలి. వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ ఫలసాయం తీసుకునే పంటలను వేయాలి. నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యమున్న వాటిని సాగు చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. తక్కువ నీటిని వినియోగించుకుని కొంచెం పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించడానికి తోటకూర సాగు అనువైనదని చెబుతున్నారు కడప ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి. నీటి ఎద్దడిని తట్టుకుని, కొద్దిపాటి సస్యరక్షణ పద్ధతులతో ఆశించిన ఆదాయం పొందడానికి వీలుందని అంటున్నారు. తోటకూర సాగుపై ఏడీ అందిస్తున్న సలహాలు, సూచనలు ఏమిటో తెలుసుకుందాం..

నేలలు

ఇసుకతో కూడిన గరప నేలలు అనుకూలం. పీహెచ్ 6–7 ఉన్న నేలలు అనువైనవి. నీరు నిలిచే బంక మట్టి, ఇసుక నేలలు పనికిరావు. పొలాన్ని బాగా మూడు నాలుగు సార్లు దుక్కి దున్నాలి. ఎకరాకు 10 టన్నులు బాగా కుళ్లిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఆ తరువాత రెండు మీటర్ల ఎడమతో ఎత్తు బెడ్లు చేసుకుని విత్తనాలు చల్లుకుంటే సరిపోతుంది. ఎకరాకు 800 గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. విత్తనం వేసే సమయంలో విత్తనానికి 10 రెట్లు సన్నటి ఇసుకతో కలిపి వేయాలి. ఎకరం పొలానికి వెదజల్లే పద్ధతిలో రెండు కిలోల విత్తనం సరిపోతుంది.



చింతకొమ్మదిన్నె మండలం మావిళ్లపల్లె వద్ద సాగు చేసిన ఆకుకూర తోట

పంట కాలం

ఆకు కూరల విత్తనం ఈ నెలాఖరు వరకు వేసుకోవచ్చు. అన్ని రకాల పంటలు దాదాపు 25–30 రోజుల్లో కోతకు వస్తాయి. ఒక పక్క కోత కోస్తుంటే, మళ్లీ కాండం చుట్టుపక్కల కొమ్మలు పెరుగుతూ వస్తాయి.

రకాలు

ఆర్ఎన్ఏ–1 :

ఆకులు, కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ రకంలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. కాండం కూడా పీచు లేకుండా మృదువుగా ఉండి రుచికరంగా ఉంటుంది. నెలలో ఎకరాకు 6.7 టన్నుల దిగుబడి వస్తుంది. విత్తిన 15–20 రోజులకు మొదటి కోత వస్తుంది. కోత తర్వాత శాఖలు విస్తరిస్తాయి. నీటి ఎద్దడి, తెల్లాకుపచ్చ తెగుళ్లను ఈ రకం తట్టుకుంటుంది.

కో–1 రకం:

ఆకులు, కాండం లావుగా, కండ కలిగి ఉంటాయి. ఎకరానికి 3–3.5 టన్నుల దిగుబడిని 25 రోజుల్లో ఇస్తుంది. ఆకులు వెడల్పుగా, ముదురు ఆకుపచ్చ రంగుతో ఉంటాయి. విత్తనాలు చిన్నవిగా ఉంటాయి.

కో–2 రకం

ఆకులు కోలగా ముదురు ఆకుపచ్చ రంగులో పొడవుగా ఉంటాయి. కాండం లేతగా, మృదువుగా ఉంటుంది. విత్తిన 30 రోజులకు కోతకు వస్తుంది. కాండం కూడా కూరగా పనికి వస్తుంది. ఎకరాకు 4–5 టన్నుల దిగుబడి వస్తుంది. విత్తనాలు పెద్దవిగా, నల్లగా ఉంటాయి.

సిర్యాకు

మొక్కలు పొట్టిగా, ఆకులు చిన్నవిగా ఉంటాయి. కాండం, వేరు కలిసే చోట గులాబీ రంగులో ఉంటుంది. నాటిన 25 రోజులకు లేత మొక్కలను కాండంతో సహా కూరగా వాడుకోవచ్చు.

ఎరువులు, కలుపు నివారణ

ఒకేసారి కాండంతో సహా పీకేసే పంటకైతే దుక్కి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలి. కోత కోసే ఆకు కూరలకు ఎకరాకు 30 కిలోల నత్రజనిని మూడు భాగాలుగా చేసి.. ప్రతి కోతకు కోత కోసిన తర్వాత నత్రజని ఒక భాగం చల్లుకుని నీటి తడి ఇవ్వాలి. కలుపు నివారణకు ఎకరాకు డ్యూయల్ మందును తేలిక నేలలకు 200 లీటర్ల నీటిలో ఒక లీటరు మందును లేదా బరువు నేలలకైతే 1.5 లీటర్ల మందును కలుపుకొని విత్తనం వేసిన 24–28 గంటల్లో భూమిపై పిచికారి చేయాలి. విత్తిన 15–20 రోజుల తర్వాత 2 శాతం యూరియా+50 పీపీఎం, జిబ్బరెల్లిక్ యాసిడ్ కలిపిన ద్రావణం పిచికారి చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

నీటి యాజమాన్యం.. దిగుబడి

భూమిలో తేమను బట్టి 7–10 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి. కోత రకాల్లో విత్తనం వేసిన 25 రోజులకు మొదటి సారి గానూ, తరువాత ప్రతి వారం నుంచి 10 రోజులకు ఒక కోత చొప్పున 90 రోజుల్లో 4–5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ పద్ధతులు

తెల్లమచ్చ తెగులు

ఆకుల అడుగుభాగాన తెల్లటి బుడిపెల వంటివి ఏర్పడతాయి. ఆకుల పైభాగాన లేత పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. పండుబారి ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటిలో మూడు గ్రాముల కాపర్‌ఆక్సైడ్ క్లోరైడ్ 2.5 గ్రాములు లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ మందును కలిపి పిచికారి చేయాలి. ఆకుల అడుగు భాగం బాగా తడిసేలా పిచికారి చేయాలి.

గొంగళి పురుగులు

చిన్న, పెద్ద పురుగులు ఆకులను తిని కొరికి వేయడం వలన ఆకులు పనికి రాకుండా పోతాయి. ఈ పురుగు నివారణకు మలాథియాన్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అనంతరం 10 రోజుల దాటిన తరువాత ఆకును కోయాలి.

బీరువాలో బంగారు మాయం

– తాళం వేయకపోవడంతో...

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెంకు చెందిన అప్పనేని వెంకటసుబ్బయ్య ఇంట్లోని రెండు బీరువాల్లో 30 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తన కుమార్తె సుధారాణి పెళ్లి రోజు కావడంతో ఆభరణాలు కావాలని అడిగింది. ఆయన బీరువాలను తెరిచి చూడగా బాక్స్‌ల్లో నగలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అరుణ్‌రెడ్డి వచ్చి పరిశీలించారు. ఇంటికి వాకిళ్లు వేయలేదా అని ప్రశ్నించారు. ఎప్పుడూ ఎవరో ఒకరం ఇంటి దగ్గర, లేక సమీపంలోనే ఉంటామని, కావున తలుపులు వేయలేదన్నారు. బీరువాలకు కూడా తాళాలు వేయలేదన్నారు. తాము ఇంట్లో లేనప్పుడు గమనించి, గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పేర్కొన్నారు. కడప నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను ఎస్ఐ రప్పించారు. క్లూస్ టీమ్ ఎస్ఐ రుక్మిణీదేవి సిబ్బందితో వచ్చి బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించి వెళ్లారు. పోయిన నగల విలువ రూ.10 లక్షలు ఉంటుందని వెంకటసుబ్బయ్య తెలిపారు.

చెయ్యేరు వంతెనపై తప్పిన ప్రమాదం

రాజంపేట: రాజంపేట–నందలూరు చెయ్యేరు వంతెనపై శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. తిరుమల నుంచి మహారాష్ట్రకు వెళుతున్న యాత్రికుల వాహనం (తుఫాన్)ను మైదుకూరు నుంచి చెన్నైకి వెళుతున్న ఐచర్ వాహనం అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో తుఫాన్ వాహనంలో ఉన్న యాత్రికులు స్వల్ప గాయాల పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ మహేష్‌నాయుడు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే హైవే పెట్రోలు వాహన సిబ్బంది, మన్నూరు పోలీసులు అక్కడికి వచ్చారు. వంతెనపై స్తంభించిన రాకపోకల పునరుద్ధరణకు వారు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిని నమ్మించి.. నగలు చోరీ

వేంపల్లె : ఓ అమాయక వృద్ధురాలిని గండి పుణ్యక్షేత్రానికి తన ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ ఇచ్చి తీసుకు వెళతానని నమ్మించి.. వేరే ప్రాంతానికి తీసుకెళ్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు, ఉంగరం, చెవి కమ్మలను తస్కరించి గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. అంతటితో ఆగకుండా ఆ వృద్ధురాలిని కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకోగా ఆదివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... వేంపల్లె గాంధీ వీధికి చెందిన ఎ.వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలు శ్రావణమాసం సందర్భంగా నాల్గవ శనివారం సాయంత్రం.. గండికి వెళ్లి ఆ రాత్రికి నిద్ర చేయాలన్న సంకల్పంతో ఇంటి నుంచి బయలుదేరింది. అయితే వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వరకే బస్సులను అనుమతించారు. దాదాపు అక్కడి నుంచి గండి క్షేత్రంలోకి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంది. వృద్ధురాలు కాబట్టి అంత దూరం నడవలేక వేచి చూస్తున్న సమయంలో.. గుర్తు తెలియని వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో కూర్చోవాలని ఆమెకు చెప్పాడు. గండిక్షేత్రానికి తీసుకెళతాడని భావించి అతని బైకుపై ఎక్కింది. అతను గండిక్షేత్రానికి వెళ్లకుండా ట్రిపుల్ ఐటీ రహదారిలోకి వెళ్లి ఓ కంకర మిషన్ ప్రాంతంలో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు, ఉంగరాన్ని, చెవులకు ఉన్న కమ్మలను తీసుకుని పరారయ్యాడు. అంతటితో ఆగకుండా దాడి చేశాడు. తలపై కొట్టి రెండు చేతులు విరిచే ప్రయత్నం చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. ఆదివారం ఉదయం ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చే సెక్యూరిటీ గార్డులు వృద్ధురాలిని గమనించారు. వేంపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు.



బాధితురాలు వెంకటసుబ్బమ్మ

రోడ్డు భద్రతపై షార్ట్ ఫిలిం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ

కడప అర్బన్ : ప్రస్తుతం అధిక మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లనే సంభవిస్తున్నాయని జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక నేకనామ్‌ఖాన్ కళాక్షేత్రంలో 'నేను తప్పు చేశాను' షార్ట్ ఫిలింను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన పెంచేందుకు షార్ట్ ఫిలిం రూపొందించడం అభినందనీయమన్నారు. రూపకర్తలు హేమారెడ్డి, శివారెడ్డిలను అభినందించారు. అనంతరం ఎస్పీని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కడప డీఎస్పీ మాసుంబాషా, సీఐలు రామకృష్ణ, దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు లేని వాహనాల పట్టివేత

కడప కోటిరెడ్డి సర్కిల్ : హైదరాబాద్ నుంచి తిరుపతికి ఎటువంటి బిల్లులు లేకుండా వెళుతున్న రెండు వాహనాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు వారు తనిఖీలు నిర్వహించారు. లోడుకు సంబంధించిన వే బిల్లులు చూపాలని అధికారులు వాహనదారులకు చెప్పారు. అయితే వారు ఎటువంటి బిల్లులను చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని తమ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనాల్లో సామగ్రి తరలించే ముందుగా అందుకు సంబంధించిన వే బిల్లులు, ఇతర పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం స్మగ్లర్లతో పోలీస్ అధికారులు, సిబ్బంది

పుల్లంపేట : మండలంలోని వత్తలూరు సమీపాన ఆదివారం మధ్యాహ్నం ఐదు ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మన్నూరు సీఐ మురళి వివరాలు వెల్లడించారు. వత్తలూరు, బావికాడపల్లి గ్రామాలకు చెందిన మల్లికార్జున, శివరాం, రెడ్డయ్య, ఈశ్వరయ్య, హరికృష్ణ, రవినాయక్ ఎర్రబైలు దగ్గర ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో 15 మంది పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. సమావేశంలో పుల్లంపేట ఎస్ఐ చెన్నకేశవులు, మన్నూరు ఎస్ఐ మహేష్, కానిస్టేబుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వ కళ మర్మాలు తెలిసిన శ్రీధర తిరుపతయ్య

కడప కల్చరల్: రసవంతమైన కావ్య నిర్మాణ చతురుడు శ్రీధర తిరుపతయ్య కవిత్వ కళా మర్మాలు తెలిసిన వాడని ప్రముఖ రచయిత, నాటకకర్త సుబ్బరాయుడు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో నెలనెల మన జిల్లా సాహిత్యం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కవి శ్రీధర తిరుపతయ్య జీవితం–సాహిత్యం అంశంపై సుబ్బరాయుడు ప్రసంగించారు. తిరుపతయ్య పూర్వ కవులకు తీసిపోని రీతిలో కావ్య రచన చేశాడని, ఆయన వ్యవసాయదారుడైనా సాహిత్యం పట్ల మిక్కిలి మక్కువతో అనేక రచనలు చేసి అలరించారన్నారు. డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, బోగా చిన్నయ్య, జానమద్ది విజయభాస్కర్, పుత్తా పుల్లారెడ్డి, శ్రీరామిరెడ్డి, శివారెడ్డి, శ్రీధర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం సాధించాలి

కడప కల్చరల్ : నంద్యాల ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంచి మెజార్టీతో విజయం సాధించాలని విజయవాడ మహేష్‌బాబు అభిమాన సంఘం నగర అధ్యక్షుడు తాడి శివ, మిత్రబృందం కడప పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహించింది. ఈ సందర్భంగా తాడి శివ మాట్లాడుతూ పెద్దదర్గా గురువులను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రిన్స్ మహేష్‌బాబు అభిమాన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కడప అర్బన్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కడప డీఎస్పీ షేక్ మాసుంబాషా హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం కడప టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆ ప్రాంతంలోని రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగర్స్‌కు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి, బక్రీద్ పండుగల సమయాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు.

బీజేపీ యువమోర్చా స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సమరనాథరెడ్డి

కడప కార్పొరేషన్ : భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా కడప నగరానికి చెందిన కె.సమరనాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్నఅనేక సమస్యలను, సవాళ్లను అన్వేషించి పార్టీ, ప్రభుత్వ దృష్టికి తీసుకు రావాలని ఆయన సమరనాథరెడ్డికి సూచించారు. అనంతరం సమరనాథరెడ్డి మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతం, ఆదర్శాలకు పునరంకితమై నీతి, నిజాయితీతో పనిచేస్తామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దోహదపడతానని తెలిపారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న సమాజానికి అనుగుణంగా యువత స్వయశక్తితో ఎదగాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాకీర్, సంఘ సేవకులు షేక్‌షావల్లిలు తెలిపారు. కడప నగరం మట్టిపెద్దపులి వద్ద ఉన్న జేకే బైక్ సర్వీస్‌పాయింట్‌లో సమ్మర్‌క్యాంపు శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన ఇరవై మంది యువకులకు జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పరమహంస భావాలను ప్రచారం చేద్దాం

కడప కల్చరల్ : మహాజ్ఞాని భగవాన్ రామకృష్ణ పరమహంస తోపాటు ఆయన శిష్యుడు స్వామి వివేకానంద భావాలను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయాలని కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద అన్నారు. ఆదివారం కడప రామకృష్ణ మిషన్‌లో రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ రాయలసీమ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి సుకృతానంద రాయలసీమ స్థాయి ప్రచార పరిషత్ కమిటీకి అధ్యక్షులుగా, స్వామి అనుపమానంద ఉపాధ్యక్షులుగా, జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాసులురెడ్డితోపాటు పలువురిని కో ఆర్డినేటర్లుగా, సభ్యులుగా ఎన్నుకున్నారు. రాయలసీమస్థాయిలో నూతన కమిటీ సభ్యులంతా పరమహంస విశ్వస్థాయి భావాలను ప్రచారం చేసేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.

పిల్లల ఆరోగ్యం కోసమే రూబెల్లా టీకాలు

కడప సెవెన్‌రోడ్స్ :

పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం తట్టు, రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ టి.బాబురావునాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిండికేట్‌బ్యాంకు పైఅంతస్తులో లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన రూబెల్లా, తట్టు టీకాల అవగాహన బెలూన్‌ను ఆయన ఎగర వేశారు. స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఆగ స్టు 1వ తేదీ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు ఈ టీకాలను ఉచితంగా వేస్తారన్నా రు. తొమ్మిది మాసాల నుంచి 15 సంవత్సరాలలోపు బాలలందరికీ తట్టు, రూబెల్లా టీకాలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఒకే టీకా ద్వారా రెండు ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చని తెలి పారు. ఈ టీకా ఎంతో సురక్షితమైనదని, దీనిపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామిరెడ్డి, డీపీఓ సుబ్రమణ్యం, బీసీ కార్పొరేషన్ ఈడీ రామచంద్రారెడ్డి, కడప ఆర్డీఓ చిన్నరాము డు, ఎల్‌డీఎం ఆంజనేయాచారి, ము న్సిపల్ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి మల్లేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ గుణశేఖర్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పీవీ రమేష్ పాల్గొన్నారు.


తట్టు,రూబెల్లా టీకాపై స్టిక్కర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

రోడ్లు, డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 28వ డివిజన్‌లో పాడైపోయిన రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేయాలని డిప్యూటీ మేయర్ బి. అరీఫుల్లా కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన ఆ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు.

27న యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కడప రూరల్: యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు ఆ అసోషియేషన్ అధ్యక్షుడు జి నారాయణ యాదవ్ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గంజికుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు గంజికుంట రవీంద్రనాథ్ ఆదివారం చేనేత వర్గాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ 2015 నుంచి ప్రతి సంవత్సరం చేనేత వర్గాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు గంజికుంట ఫౌండేషన్ బుక్ బ్యాంక్ నుంచి పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని 12 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు ఈ సాయం అందించామన్నారు. మొదటి, నాల్గవ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు, మొదటి సెమిస్టర్ పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. తర్వాత మిగతా సెమిస్టర్ పుస్తకాలను క్రమంగా అందజేస్తామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో చేనేత వర్గాల యువతకు వివాహ పరిచయ వేదిక ఏర్పాటు, పెద్ద వయస్సు వారికి హెల్త్‌చెక్, యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఘంటసాల జన్మదినాన్ని పురస్కరించుకుని డిసెంబరు 23, 24 తేదీల్లో సంగీత పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి గంజికుంట గణేష్, ఉపాధ్యక్షులు డాక్టర్ గంజికుంట తిరుమలరావు, కన్వీనర్ గంజికుంట అశోక్, ట్రాన్స్‌కో డీఈలు శ్రీరామచంద్రమూర్తి, దాసరి కృష్ణకుమార్, పద్మశాలి భవన్ అధ్యక్షులు అవ్వారు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభువు పట్ల విశ్వాసంతో ఉండాలి

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు పట్ల అందరం విశ్వాసం కలిగి ఉండాలని, జీవితంలో ఎదురైన సమస్యలను తొలగించేది ఆయనేనని సీనాయి డివైన్ రీట్రీట్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జేసన్ అన్నారు. ఆదివారం స్థానిక మరియాపురం సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చి ఆవరణంలో ఏకదిన సువార్త స్వస్థత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జేసన్ మాట్లాడుతూ రాతి గుండెగల వారిని ప్రభువే సున్నితంగా మారుస్తాడని, లోకంలో మనిషికి మనిషే శత్రువని, ఆదరించే ప్రభువుపైనే విశ్వాసులు ఆధారపడాలని పేర్కొన్నారు.

మధుమేహం.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరం

వైవీయూ : మధుమేహవ్యాధి పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదకరమని ప్రముఖ షుగర్‌వ్యాధి నిపుణులు డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని అక్కాయపల్లెలోని సర్దార్‌వల్లభాయ్‌పటేల్ రోడ్డులో సువర్ణభారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా షుగర్‌వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జీవనశైలిలో జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల డయాబెటిస్ వస్తుందన్నారు. డయాబెటిస్‌కు దూరంగా ఉండాలంటే కనీసం 45 నిమిషాల పాటు ప్రతిరోజూ వ్యాయామ చేయాలని సూచిం చారు. బ్లడ్ టు లివ్ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్, సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, జబీరుల్లా, హరి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాజీవ్ గాంధీ ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చైర్మన్ చార్లెస్ తెలిపారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరచుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌సాహెబ్ పిలుపునిచ్చారు. కడపలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు ఓరియంటేషన్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యావంతులై సమాజ స్థితిగతులు మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు, ఆశయాలు మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిందన్నారు. దీని ద్వారా నేటి యువత సమాజంపై అవగాహన కలిగి దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. యూనిట్– 2 ప్రోగ్రాం అధికారి మమత మాట్లాడుతూ జాతీయ సేవాపథకం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతోపాటు మనోధైర్యం కలుగుతుందన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌సాహెబ్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్, వృక్షశాస్త్ర అధ్యాపకులు బయపురెడ్డి, పీవీ కృష్ణారెడ్డిలు తెలిపారు. కడప నగరపాలక మొయిన్స్‌ూల్లో ఆదివారం సీవీ రామన్ సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సైన్సు ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సైన్సు చాలా అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను అభివృద్ధి పథంలో నడవాలన్నారు. అనంతరం వారు కాంతి పరావర్తనం, వక్రీభవన్‌తోపాటు జన్యశాస్త్రంపై ఏక సంకరణం, ద్వి సంకరణం తదితరల అంశాల గురించి ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. సైన్సుక్లబ్ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ రెడ్డి, డివిజన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, క్లబ్ సెక్రటరీ వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ ఆన్‌లైన్ నమోదు, ఎస్‌సీఎస్‌సీలో ఆన్‌లైన్ నమోదు చేసుకునే విధానం, ఎన్‌సీఎస్‌సీలో విద్యార్థులు ఎలా ప్రాజెక్టులు తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విజయేశ్వరి, సుబ్రమణ్యం, విజయప్రసాద్, సుధాకర్, పద్మాకర్, ప్రసాద్‌రావు, రమేష్‌బాబు, నిత్యానందరెడ్డి, మధుసూదన్‌బాబు, మెహన్‌బాబు, అబ్దుల్‌సత్తార్, మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వృక్షశాస్త్ర అధ్యాపకుడు కృష్ణారెడ్డి

జీఓ 30,39ని రద్దు చేయాలి

కడప రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాస్తోందని అంజుమన్ తరఖీ–ఎ–ఉర్దు కడప శాఖ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు తమ హక్కులను కాలరాసే జీఓ 30, 39ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సయ్యద్ హిదాయతుల్లా, సయ్యద్ ఇక్బాల్, సత్తార్ ఫైజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 30, 39 కారణంగా ఆంధ్ర యూనివర్సిటీలో ఉర్దూ విభాగం మూత పడిందన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో 1956 నుంచి ఉర్దూ విభాగం ఉందన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఏడుగురు ప్రొఫెసర్స్ ఉండాల్సి ఉండగా అందులో ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రాయూనివర్సిటీ తరహాలోనే ఎస్వీ యూనివర్సిటీలో కూడా ఉర్దూ విభాగాన్ని మూసివేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా స్పందించి మైనార్టీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

సాక్షి
వైఎస్ఆర్ జిల్లా | సోమవారం | ఆగస్టు | 21 | 2017

Portal Updates:
www.sakshieducation.com
→ Intelligence Bureau ACIO Grade-II/Executive exam success tips
→ AP Post Circle Notification 2017: 39 Multi Tasking Staff Posts
→ Download SBI: Probationary Officers Interview Call Letter

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx Send your Feedback to..sakshieducation@gmail.com

గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?



డాక్టర్ డి. సమ్మయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
బయాలజీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలు ఏవి?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) క్షీరదాలు

2. కింది వాటిలో ఉష్ణరక్త జీవులు ఏవి?
1) ఎగిరే బల్లి, పక్షి 2) పక్షి, గోదురుకప్ప
3) గోదురుకప్ప, కుందేలు
4) కుందేలు, పావురం

3. భూమిపై నివసించిన తొలి జీవులుగా వేటిని పరిగణిస్తారు?
1) తొండలు 2) సర్పాలు
3) కప్పలు 4) డిప్నాయ్

4. కాలేయం.. ఆహారాన్ని ఏ రూపంలో నిల్వ చేస్తుంది?
1) గ్లూకోజ్ 2) గ్లైకోజన్
3) ఆల్బుమిన్ 4) ఎ.టి.పి.

5. మానవుడిలో ఆహారం శ్వాసనాళంలోకి ప్రవేశించకుండా నిరోధించేది ఏది?
1) స్వరపేటిక 2) గ్రసని
3) కంఠబిలం 4) ఉపజిహ్వ

6. జీర్ణక్రియ, శోషణం జరిపే ఆహారనాళ భాగం ఏది?
1) జీర్ణాశయం 2) పేగు
3) పురీషనాళం 4) ఆస్య కుహరం

7. చిన్న పిల్లల్లో జీరాప్తాల్మియా, పెద్దవారిలో నిక్టోలోపియా(రేచీకటి) ఏ విటమిన్ లోపం వల్ల కలుగుతాయి?
1) డి 2) ఎ 3) ఇ 4) కె

8. వివిధ కర్బన పదార్థాల్లో అత్యంత ఎక్కువ శక్తినిచ్చేవి ఏవి?
1) ప్రొటీన్లు 2) పిండి పదార్థాలు
3) విటమిన్లు 4) లిపిడ్లు

9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్లీహాను రక్తం నిల్వ చేసే రిజర్వాయర్‌గా పేర్కొంటారు
బి) ఇది ఆర్.బి.సి., డబ్ల్యు.బి.సి.లను ఉత్పత్తి చేస్తుంది
సి) వృద్ధ, మృత ఆర్.బి.సి.లను నాశనం చేయడం వల్ల ప్లీహాను 'ఎర్రరక్త కణాల గ్రేవ్‌యార్డ్' అని పిలుస్తారు
1) ఎ, బి సరైనవి 2) ఎ, సి సరైనవి
3) సి మాత్రమే సరైంది
4) ఎ, బి, సిలు సరైనవే

10. గుండె పోషణకు, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమని ఏది?
1) పుపుస ధమని 2) కరోనరీ ధమని
3) వృక్క ధమని 4) మహా ధమని

11. కంట్లోకి కాంతి ప్రవేశించకుండా నియంత్రించేది?
1) ప్యూపిల్ 2) బ్లైండ్‌స్పాట్
3) ఐరిస్ 4) దృఢస్తరం

12. అడ్రినలిన్ హార్మోన్ దేన్ని పెంచుతుంది?
1) హృదయ స్పందన 2) రక్తపీడనం
3) 1, 2 4) ఏదీ కాదు

13. స్త్రీ బీజ కోశ హార్మోన్లు ఏ రకానికి చెందినవి?
1) ప్రొటీన్లు 2) స్టిరాయిడ్లు
3) పాలీశాఖరైడ్లు 4) లిపిడ్లు

14. కింది వాటిలో పరస్పర వ్యతిరేక ధర్మాన్ని కలిగి ఉన్న హార్మోన్లు ఏవి?
1) ఇంటర్ మిడిన్, ఇన్సులిన్
2) ఇన్సులిన్, గ్లూకగాన్
3) గ్లూకగాన్, ఎడ్రినలిన్
4) ఎడ్రినలిన్, ఇంటర్‌మిడిన్

15. మూత్రంలో యూరియాను విసర్జించే జంతువు ఏది?
1) స్పిర్నా 2) ఆంబ్లిస్టోమా
3) కంగారు 4) డ్రాకో

16. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
1) నలుపు రంగు 2) పడగ
3) రాళ్లల్లో నివసించడం వల్ల
4) పడగ, మూడో అదిఓష్ట పొలుసు

17. బాతు ముక్కు(డక్ బిల్డ్) ప్లాటిపస్ అనేది..?
1) విలుప్త సరీసృపం 2) పక్షి
3) మంచినీటి చేప 4) క్షీరదం

18. స్వేద గ్రంథులు లేని క్షీరదం ఏది?
1) కోతి 2) ఆవు
3) తిమింగలం 4) పంది

19. ముంజేతిని కదిపే కండరాలు ఏవి?
1) నునుపు కండరాలు
2) రేఖిత కండరాలు
3) హృదయ కండరాలు 4) ఏదీకాదు

20. జతపరచండి.
a) కుంతకాలు i) 4
b) రదనికలు ii) 8
c) అగ్ర చర్వణకాలు iii) 8
d) చర్వణకాలు iv) 10
v) 12

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	i	ii	iii	iv
3)	i	iii	v	iv
4)	iv	v	iii	ii

21. జతపరచండి.
a) పుర్రె ఎముకలు i) 18
b) కపాల ఎముకలు ii) 22
c) పక్కటెముకలు iii) 24
d) రెండు కాళ్ల ఎముకలు iv) 30
v) 60

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	ii	i	v	i
3)	i	ii	iii	iv
4)	iii	ii	iv	v

22. రెండు ఎముకలను, ఎముకను కండరాలతో కలిపి ఉంచే నిర్మాణాలు వరుసగా..?
1) లిగమెంట్, టెండాన్స్
2) టెండాన్స్, లిగమెంట్
3) కీలు, సైనోవియల్ ద్రవం
4) శోషరసం, నరాలు

23. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) కార్నివోర్స్ – మాంసాహారులు
బి) శాంగ్వివోర్స్ – రక్తాన్ని పీల్చేవి
సి) సూడో రూమినేట్ – కుల్లుతున్న సేంద్రియ పదార్థాలను గ్రహించేవి
1) ఎ, బి
2) ఎ, సి 3) సి మాత్రమే
4) ఎ, బి, సి

24. డెంగీ వ్యాధికి గురైన వారి రక్తంలో ఏ రక్తకణాల సంఖ్య తగ్గుతుంది?
1) ఆర్.బి.సి. 2) డబ్ల్యు.బి.సి
3) ప్లేట్‌లెట్స్ 4) పైవన్నీ

25. జతపరచండి.

తెల్ల రక్తకణాలు	ఇతర పేర్లు
a) ఇసినోఫిల్స్	i) వ్యాధినిరోధక శక్తి
b) బేసోఫిల్స్	ii) యాంటీ అలర్జీ సెల్స్
c) న్యూట్రోఫిల్స్	iii) మైక్రో పోలీసేమెన్
d) లింపోసైట్స్	iv) గాయాలను మాన్పడం
	v) బ్లడ్ కేన్సర్‌కు కారణం

1) a-ii, b-iv, c-iii, d-i
2) a-i, b-ii, c-iii, d-v
3) a-iii, b-ii, c-i, d-iv
4) a-v, b-iv, c-iii, d-ii

26. విసర్జించిన మూత్రం వెంటనే ఎలాంటి వాసన రాదు. కానీ కొంత సమయం తర్వాత వాసన రావడానికి కారణం?
1) మూత్రంలోని యూరియా.. యూరికామ్లంగా మారడం
2) మూత్రంలోని యూరియా.. బాక్టీరియా వల్ల అమ్మోనియా మారడం
3) బాక్టీరియా వల్ల యూరియా.. యూరికామ్లంగా మారడం
4) యూరికామ్లం.. యూరియాగా మారడం

27. జతపరచండి.

శరీర భాగాలు	అధ్యయనం
A) హృదయం	i) ఫ్రినాలజీ
B) మెదడు	ii) నెఫ్రాలజీ
C) కాలేయం	iii) హెపటాలజీ
D) ఊపిరితిత్తులు	iv) పల్మనాలజీ
	v) కార్డియాలజీ

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	v	i	iii	iv
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

28. బొద్దింక ఆర్థ్రోపోడా వర్గానికి చెందుతుందని తెలియజేసేవి?
1) స్పర్శశృంగాలు 2) రెక్కలు
3) వివృత రక్తప్రసరణ వ్యవస్థ
4) అతుకుల కాళ్లు

29. కింది వాటిలో రక్తాన్ని పీల్చే రెక్కలు లేని బాహ్య పరాన్న జీవి అయిన కీటకం ఏది?
1) పెడిక్యులస్ 2) దోమ
3) టిక్ 4) మైట్స్

30. కింది వాటిలో మానవుడికి మేలు చేసే కీటకాలు ఏవి?
1) తేనెటీగ, మిడత, లక్క కీటకం
2) పట్టు పురుగు, తేనెటీగ, తూనీగ, మిడత
3) లక్క కీటకం, పట్టుపురుగు, తేనెటీగ
4) రైస్ వీవిల్, పట్టుపురుగు, తేనెటీగ

31. ముత్యపు చిప్ప శాస్త్రీయ నామం ఏది?
1) సింక్టాడ 2) నియోపిలైనా
3) నాటిలస్ 4) జాంకస్

32. కింది వాటిలో పరాన్న జీవులు లేని వర్గం?
1) పొరిఫెరా 2) మలస్కా
3) అనిలెడా 4) ఇకైనోడర్మేటా

33. ముఖబాహ్య జీర్ణక్రియ కలిగిన జీవి ఏది?
1) సముద్ర నక్షత్రం 2) బొద్దింక
3) జలగ 4) పైలా

34. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) ఏనుగు గర్భావధి కాలం – 600 రోజులు
బి) మానవుడి గర్భావధి కాలం – 280 రోజులు
సి) అపోజం గర్భావధి కాలం – 21 రోజులు
1) ఎ, బి 2) ఎ, సి
3) సి మాత్రమే 4) ఎ, బి, సి

35. ఆహార గొలుసులోని వివిధ పోషక స్థాయిలకు సంబంధించి కింది వాటిలో సరైన వరసక్రమం ఏది?
1) ఉత్పత్తి దారులు– ద్వితీయ వినియోగదారులు – విచ్ఛిన్నకారులు – ప్రాథమిక వినియోగదారులు
2) ఉత్పత్తి దారులు–ప్రాథమిక వినియోగదారులు – ద్వితీయ వినియోగదారులు – తృతీయ వినియోగదారులు
3) ప్రాథమిక వినియోగదారులు – ఉత్పత్తి దారులు – విచ్ఛిన్నకారులు
4) విచ్ఛిన్నకారులు – ద్వితీయ వినియోగదారులు – ప్రాథమిక వినియోగదారులు

36. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఆల్బుమిన్, గ్లోబ్యులిన్‌లు ప్లాస్మాలో ఉండే ప్రొటీన్లు
బి) ఆస్టిన్యూరిన్ కంటిలో ఉండే ప్రొటీన్
సి) కెసిన్ పాలలో ఉండే ప్రొటీన్
1) ఎ, బి 2) ఎ, సి
3) ఎ, బి, సి 4) బి మాత్రమే

37. క్షీర గ్రంథులు ఏ గ్రంథులకు రూపాంతరాలు?
1) స్వేద గ్రంథులు
2) సెబేషియస్ గ్రంథులు
3) వాసన గ్రంథులు 4) ఏదీకాదు

38. మైటాసిస్ దేనిలో జరుగుతుంది?
1) పరాగ రేణువులు 2) శాఖీయ కణాలు
3) పిండం 4) అండం

39. కణజాల వర్ధనంలో అర్ధఘన యానకాన్ని తయారు చేయడానికి కావలసిన పదార్థం?
1) అగార్ – అగార్ 2) జిగురు
3) రెసిన్ 4) పిండి పదార్థం

40. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణం ఏది?
1) దారునాళం
2) చాలనీ నాళ మూలకాలు
3) దృఢ కణాలు 4) దవ్వరేఖ

41. వర్గీకరణకు మూల ప్రమాణం ఏది?
1) ప్రజాతి 2) జాతి
3) కుటుంబం 4) రాజ్యం

42. ఆహారంగా తీసుకునే 'క్యాబేజీ' ఒక:
1) ఫలం 2) పుష్ప విన్యాసం
3) మొగ్గ 4) పుష్పం

43. కింది వాటిలో సరికానిది?
1) జనుము, కంది, వేరుశెనగ, చిక్కుడు.. ఫాబేసి కుటుంబానికి చెందినవి
2) క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి, ఆవాలు.. బ్రాసికేసి కుటుంబానికి చెందినవి
3) వంగ, టమాట, బంగాళదుంప, మిరప.. కుకుర్బిటేసి కుటుంబానికి చెందినవి
4) ఉల్లి, వెల్లుల్లి, కలబంద.. లిల్లియేసి కుటుంబానికి చెందినవి

44. మామిడి పండులో తినగలిగే భాగం ఏది?
1) మధ్య ఫలకవచం
2) అంతర ఫలకవచం
3) బాహ్య ఫలకవచం 4) విత్తనం

45. జీవానికి భౌతిక ఆధారం ఏది?
1) సైటోప్లాజమ్ 2) జీవ పదార్థం
3) కేంద్రక రసం 4) కణరసం

46. పక్వ స్థితిలో ఉన్న టమాట ఫలాన్ని సూదితో గుచ్చితే నీరు లాంటి ద్రవం వస్తుంది. ఈ ద్రవం నిల్వ ఉండే భాగాన్ని ఏమంటారు?
1) కణ ద్రవ్యం 2) ప్లాస్టిడ్
3) రిక్తిక 4) కేంద్రకం

47. క్షయకరణ విభజనలోని ఏ దశ కొత్త జాతుల ఆవిర్భవానికి, పరిణామ మార్పులకు తోడ్పడుతుంది?
1) డిప్లోటీన్ 2) డయాకైనెసిస్
3) జైగోటీన్ 4) పాకిటీన్

48. జతపరచండి.
జాబితా – I
i) వృక్ష రాజ్య ఉభయచరాలు
ii) బొటానికల్ స్నేక్స్
iii) ఫానిరోగామ్స్
iv) కవచ రహిత విత్తనాలు (నగ్న విత్తనాలు) ఉండే మొక్కలు
జాబితా – II
a) వివృత బీజాలు
b) బ్రయోఫైటా మొక్కలు
c) టెరిడోఫైటా మొక్కలు
d) పుష్పించని మొక్కలు
e) పుష్పించే మొక్కలు

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	ii	iii	v	i
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

49. గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?
1) డెలావిబ్రియో బ్యాక్టీరియోవోరస్
2) బాసిల్లస్ డీనైట్రోఫికెన్స్
3) సూడోమోనాస్ పుటిడా
4) క్లాస్ట్రీడియం బోట్యులినమ్

50. కింది వాటిలో ఏక కణ ప్రొటీన్‌గా ఉపయోగపడని జీవి ఏది?
1) ఈస్ట్ 2) బ్యాక్టీరియా
3) వైరస్ 4) శైవలం

సమాధానాలు

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 2	7) 2	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 3
16) 4	17) 4	18) 3	19) 2	20) 1
21) 1	22) 1	23) 3	24) 3	25) 1
26) 2	27) 2	28) 4	29) 1	30) 3
31) 1	32) 4	33) 1	34) 3	35) 2
36) 3	37) 2	38) 2	39) 1	40) 2
41) 2	42) 3	43) 3	44) 1	45) 2
46) 3	47) 4	48) 2	49) 1	50) 3

How many persons are there..



K.M. Jaya Rao

Subject Expert, Hyderabad.

IBPS RRB Special Reasoning

Model Questions

Directions (Q.No. 1 - 5): Read the information carefully and answer the following questions:

Seven friends A, B, C, D, E, F and G play different games - Cricket, Volleyball, Football, Basketball, Badminton, Snooker and Tennis not necessarily in the same order. Each one of them has a liking for a different character- Thor, Ironman, Hulk, Spiderman, Captain America, Deadpool and Hawk Eye not necessarily in the same order. Three of them are boys. A likes Spiderman but does not play Cricket. The one who plays Volleyball likes Hawk Eye and is a boy. C plays Tennis and does not like Hulk. D plays Football and he does not like Thor. F likes Hawk Eye and E likes Deadpool. The one who likes Ironman plays Badminton. B does not like Badminton.The boy who plays Basketball likes Captain America.

1. Who plays Volleyball?
1) A 2) G 3) F
4) Cannot be determined
5) None of these

2. Which of the following is the group of boys?
1) F, C, D 2) F, B, D
3) B, D, A
4) Cannot be determined
5) None of these

3. Which game is played by E?
1) Volleyball 2) Badminton
3) Snooker 4) Cricket
5) None of these

4. Who plays Snooker?
1) A 2) B 3) E
4) Cannot be determined
5) None of these

5. Which of the following combinations of Character - Person - Game is correct?
1) Ironman - G - Basketball
2) Captain America - D - Football
3) Dead pool - E - Volleyball
4) Ironman - G - Badminton
5) None of these

6. Which character is liked by 'B'?
1) Captain America
2) Thor 3) Hulk
4) Ironman 5) None of these

Directions (Q.No. 7 - 12): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: 35 24 maintain 87 safe distance 60 12 other cats
Step-1: cats 35 24 maintain 87 safe distance 60 other 12
Step-2: 24 cats 35 maintain 87 safe 60 other 12 distance
Step-3: maintain 24 cats 87 safe 60 other 12 distance 35
Step-4: 60 maintain 24 cats 87 safe 12 distance 35 other
Step-5: safe 60 maintain 24 cats 12 distance 35 other 87

And Step 5 is the last step of the above arrangement, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate steps for the given input.

Input: 35 and 15 days concept time 50 75 be 60

7. Which element is third the right of the element which is seventh element from the right end in the last step of the given arrangement?
1) 75 2) time 3) be
4) 60 5) days

8. What is the position of 'concept' from the right end in the second - last step of the given arrangement?
1) Eighth 2) Sixth 3) Ninth
4) Seventh 5) Tenth

9. Which element/s is/ are exactly between 'concept' and 'time' in the fourth step of the given arrangement?
1) Both 'and' and '35'
2) days
3) There is no element
4) Both 'days' and 'concept'
5) 35

10. What is the position of 'concept' from the left of '60' in the third step of the given arrangement?
1) Fourth 2) Sixth
3) Ninth 4) Seventh
5) Fifth

11. In which step of the given arrangement are the elements 'time 50 75 60' found in the same order?
1) Fourth 2) Second
3) Third 4) Fifth
5) The given order of elements is not found in any step

12. Which of the following is the last step of the given arrangement?
1) time 60 concept 35 and 15 be 50 days 75
2) time days concept be and 15 35 50 60 75
3) 15 35 50 60 75 time days concept be and
4) time days concept be and 15 35 50 60 75
5) time 75 concept 50 15 and be 35 days 60

Directions (Q. No. 13 - 18): Study the following information carefully and answer the given questions.

There are six sports persons A, D, O, P, Q and R whose earnings are different based on their performance. Each one has a different pet name - Viru, Tillu, Bannu, Fani, Chinna and Pari but not necessarily in the same order. Each one has a car of different colour- blue, white, green, violet, yellow and black, again not necessarily in the same order. Bannu earns less than Chinna. Tillu owns black car. There is only one in between the person who has green colour car and Tillu in the order of earnings. Chinna has blue colour car. The person who has white colour car is the highest earner. There are two persons between D and P in the order of earnings. Neither D nor P owns white car. Q, who is Bannu, earns more than Viru and the one who owns black car. There are two persons between Bannu and A in the order of earnings. A is not the least earner. O earns less than only P and Pari. The person who owns violet car is earning least.

13. How many persons are there between A and R in the order of earning?
1) One 2) Two 3) Three
4) Four 5) None

14. Who earns more than only the least earner?
1) A 2) O 3) Q
4) Tillu 5) None of these

15. Who among the following earns maximum?
1) A 2) O 3) Q
4) The person whose pet name is Chinna
5) None of these

16. Which of the following is not correct?

1) A	Pari	White
2) P	Chinna	Blue
3) R	Viru	Violet
4) O	Fani	Yellow
5) D	Tillu	Black

17. Who is Fani?
1) A 2) O 3) R
4) D 5) None of these

18. Who is ranking third in the descending order of earning?
1) A 2) O 3) Q
4) P 5) None of these

Directions (Q.No. 19 - 22): Study the following arrangement of letters, digits and symbols carefully to answer the questions given below.

A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

19. If all the numbers are deleted from the above arrangement, and the remaining set of elements is reversed, then which of the following will be fourth to the left of the 10th element from the left end?
1) £ 2) E 3) Z
4) = 5) None of these

20. If every third element is dropped from the first in the above series till the end, then how many symbols, letters and numbers respectively which remain in the series?
1) 6,6,4 2) 5,5,6
3) 6,4,6 4) 4,6,6
5) None of these

21. How many such symbols are there in the arrangement each of which is not immediately followed by a number?
1) Five 2) Four 3) One
4) Two 5) None of these

22. If 1©5 is related to P8Z in a certain way, then in the same way G9A is related to:
1) 8=P 2) £L?
3) 87L 4) 8=@
5) None of these

Key with Explanations

(1-6):

Person	Gender	Character	Game
A	–	Spiderman	Snooker
B	+	Captain America	Basketball
C	–	Thor	Tennis
D	+	Hulk	Football
E	–	Deadpool	Cricket
F	+	Hawk Eye	Volleyball
G	–	Ironman	Badminton

1) 3 **2)** 2 **3)** 4 **4)** 1
5) 4 **6)** 1

(7-12):

Words have been picked up alphabetically and numbers have been picked up in ascending order.

In the first step, Word and number have been arranged in the first position and last position respectively.

In the second step word and number have been arranged in the last and the first position respectively, and the process is repeated.

Input: 35 and 15 days concept time 50 75 be 60
Step-1: and 35 days concept time 50 75 be 60 15
Step-2: 35 and days concept time 50 75 60 15 be
Step-3: concept 35 and days time 75 60 15 be 50
Step-4: 60 concept 35 and time 75 15 be 50 days
Step-5: time 60 concept 35 and 15 be 50 days 75

and Step 5 is the last step.

7) 3; be **8)** 3; ninth
9) 1; both 'and' and '35'
10) 2; sixth
11) 2; second
12) 1; time 60 concept 35 and 15 be 50 days 75

(13 -18):

Order of Earnings	Persons	Pet name	Colour of car
Highest earner	A	Pari	White
	P	Chinna	Blue
	O	Fani	Green
	Q	Bannu	Yellow
	D	Tillu	Black
Least earner	R	Viru	Violet

13) 4; Four
14) 4; Tillu **15)** 1; A
16) 4; O Fani Yellow
17) 2; O **18)** 2; O

(19 - 22):

19) 3; Z (? @ P L £ Z)
20) 1; 6,6,4
Symbols: $, ©, β, =, £, @
Letters: A, H, N, Y, Z, P
Numbers: 9,5,3, 8,
21) 2; Four
Symbol immediately followed by letter: © G, β, T, =, Z
Symbol immediately followed by Symbol: @ ?
22) 2; £L?
A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

The relation between 1©5 and P8Z is as follows:


(3rd from left) 1 © 5 :
+2 +3
(3rd from right) P 8 Z
–2 –3


'+' indicates counting in the forward direction
'–' indicates counting in the backward direction

(6th from left) G 9 A :
–2 –3
(6th from right) £ L ?
+2 +3

లెక్కించండి.. రంగులు వేయండి


ఇక్కడ ఉన్న బొమ్మలో ఏఏ పండ్లు ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





పూరించండి

పిల్లలూ... కింద గుమ్మడికాయలకు వరుసలో అంకెలు వేసి ఉన్నాయి. ఖాళీ గుమ్మడి కాయలకు ఏ అంకె ఉండాలో గుర్తించి పూరించండి.



దారి కనుక్కోండి



నాన్నా చెప్పవా?

ఒక గుంపులోని జంతువులు ఎప్పటికీ ఆ గుంపులో ఉండవా?

భూమి మీద అనేక జంతువులు, పక్షులు ఎక్కడికక్కడ సమూహాలుగా జీవిస్తూ ఉండటం సర్వ సాధారణమైన విషయం. ఇలా గుంపులో ఒక భాగంగా జీవించడం వల్ల ఆయా జంతువులకు కొన్ని లాభాలతో పాటు నష్టాలూ ఉంటాయి. ముఖ్యంగా కరువు కాటకాలు, ఆహారం తగినంతగా దొరకకపోవడం వంటి ప్రతికూల పరిస్థితుల్లో గుంపులోని కొన్ని జంతువులు బాగా నష్టపోతాయి. ముఖ్యంగా మిగతా వాటి కన్నా బలహీనంగా ఉండే జంతువులు ఎక్కువ నష్టపోతాయి. ఏదేమైనా ఒక సమూహంలో పుట్టిన జంతువులు ఎప్పటికీ ఆ సమూహంలోనే ఉండటం అనేది జరగదు. కొన్ని జంతువులు తమకు తాముగా ఆ సమూహం నుంచి విడిపోయి వేరుగా జీవించడమో, లేదా మిగతా జంతువులువాటిని వెళ్లగొట్టడమో జరుగుతుంది. ఉదాహరణకు ఒక సింహం గుంపులో పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక వాటిని మిగతా సింహాలు ఆ గుంపు నుంచి తరిమేస్తాయి. అలా తరిమేయబడ్డ సింహాలు కొంత కాలంపాటు ఒంటరిగానే జీవిస్తాయి. ఆ తరువాత ఏదైనా ఒక సింహాల గుంపులో భాగంగా మారేందుకు ప్రయత్నిస్తాయి. అయితే అదేమంత సులభమైన పని కాదు సుమా. అందుకై ఆ గుంపులోని మిక్కిలి బలమైన సింహంతో (సాధారణంగా నాయకుడితో)అవి పోట్లాడవలసి ఉంటుంది. అలా పోట్లాడిన ఆ సింహాన్ని ఓడించడం గాని, చంపడంగాని జరిగితే అప్పుడు దానికి ఆ గుంపులో స్థానం దక్కుతుంది. ఒకసారి స్థానమంటూ దక్కాక ఇక అది ఆ గుంపులో ఒక భాగమైపోతుంది.



కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





మీకు తెలుసా?

ఒక్కో మేఘం బరువు దాదాపు వంద ఏనుగుల బరువుకు సమానం



అమెరికాలో మనుషులకన్నా తుపాకులే ఎక్కువగా ఉన్నాయి



సముద్రతీరాల్లో ఏటా కాలుష్యం కారణంగా పదిలక్షల పక్షులు, పదికోట్ల క్షీరదాలు మరణిస్తున్నాయి



చనిపోయాక నరకలోకం ఉంటుందని ప్రపంచంలో దాదాపు 71 శాతం నమ్ముతున్నారు



రోజూ రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగేవారికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు తక్కువగా వస్తాయట!



హనోకో చేప దాదాపు 250 సంవత్సరాలు బతుకుతుంది




చదవడం రాయడం రానివారు ప్రపంచంలో దాదాపు 78 కోట్ల మంది ఉన్నారు



మోనాలిసాకు కను బొమ్మలు ఉండవు



కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



వైఎస్సార్ జిల్లా | సోమవారం | ఆగస్టు | 21 | 2017 సాక్షి

22న జిల్లాస్థాయి జూడో ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని చిన్నచౌకు పద్మశాలీయ కల్యాణ మండపం సమీపంలో జిల్లాస్థాయి జూడో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి ఎం. విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 15 సంవత్సరాల వయసు కలిగిన క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరుకావచ్చని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

వేంపల్లె గంగాధర్‌కు సత్కారం



వేంపల్లె గంగాధర్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర భాషాపాధ్యాయ సంఘం నాయకులు

కడప కల్చరల్ : ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌ను రాష్ట్ర భాషాపాధ్యాయ సంఘం సమావేశంలో సత్కరించారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సంఘం సభలో రాష్ట్ర లాగ్వేంజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి అంకాల్ కొండయ్య, సభ్యులు బోగా గంగాధర్, పల్లా భాస్కర్, ఖాదర్‌బాషా తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని గ్రహించిన ఖ్యాతి తమ తోటి ఉపాధ్యాయుడు వేంపల్లె గంగాధర్‌కు మాత్రమే దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ లోకానికి ఆయన స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. మరెన్నో రచనలు చేసి ఇంకెన్నో ఉన్నత స్థాయి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

కార్మికుల శ్రేయస్సుకోసం సమష్టిగా పోరాటం

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ప్రతి కార్మికుడి శ్రేయస్సు కోసం సమష్టిగా పోరాటాలు చేస్తామని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు అన్నారు. కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి నాయకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న ప్రతి కార్మికుడు తన తోటి కార్మికుడికి ఏదైనా కష్టం వస్తే సమష్టిగా పోరాటం చేయాలన్నారు. యాజమాన్యం తప్పుడు నిర్ణయాలను ఎప్పటికపుడు ఎదిరించాలన్నారు. ఈక్రమంలోనే ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం కూడా అదే స్థాయిలో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఎస్ఎన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నారాయణ, నెల్లూరు జోనల్ కార్యదర్శి శ్యామూల్ బాబు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసయ్య, కడప జోనల్ అధ్యక్ష కార్యదర్శులు కెకె కుమార్, ఎన్ఆర్ శేఖర్, రీజనల్ కార్యదర్శి ఆర్. నారాయణ, కోశాధికారి వివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు

కడప స్పోర్ట్స్ :

కడప నగరంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–16 క్రికెట్ పోటీల్లో చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 9 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 91.3 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 32 పరుగులు, పవన్ 22 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు కరణ్ 4 వికెట్లు, దీపక్‌రామానుజయ 3, లిఖిత్ కుమార్ 3 వికెట్లు తీశారు. దీంతో 99 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం చిత్తూరుకు లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 6 పరుగులు చేసింది. జట్టులోని గౌతమ్ 6 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కృష్ణా బౌలర్ మానస్ 1, సుభాని 1 వికెట్ తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో తలపడుతున్న చిత్తూరు-కృష్ణా జట్లు

విజయం దిశగా తూర్పుగోదావరి జట్టు..

కేఎస్ఆర్ఎం క్రీడామైదానంలో నిర్వహిస్తున్న మరోమ్యాచ్‌లో తూర్పుగోదావరి విజయం దిశగా సాగుతోంది. 108 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన తూర్పుగోదావరి జట్టు 118.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 282 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని సూర్యచైతన్య 116 పరుగులు, జశ్వంత్ 56 పరుగులు చేశారు. పశ్చిమగోదావరి బౌలర్లు రూపేష్ 4, జాన్‌రిచర్డ్స్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు 24 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 57 పరుగులు చేసింది. జట్టులోని కేఎస్ఎన్ రాజు 28 పరుగులు, జాన్‌రిచర్డ్స్ 24 పరుగులతో క్రీజులో ఉన్నారు. కాగా పశ్చిమగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే.

విశాఖ జోరు..

కేఓఆర్ఎం క్రీడామైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో విశాఖ దూసుకువెళ్తోంది. 88 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 90.5 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని నితీష్‌కుమార్ 110 పరుగులు, రఘురామ్ 38 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు అజిత్‌బాబు 4, ప్రసాద్ 2, తౌషిఫ్‌అహ్మద్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. జట్టులోని రోషన్‌పవన్‌కుమార్ 31 పరుగులు చేశారు. విశాఖ బౌలర్ యోగి 3 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగుల ఆధిక్యం సాధించింది. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

చాంపియన్లుగా కృష్ణా, కడప

జమ్మలమడుగు: బేస్‌బాల్ క్రీడాపోటీల్లో బాలికల విభాగంలో వైఎస్సార్ కడప, బాలుర విభాగంలో కృష్ణాజిల్లాలు చాంపియన్లుగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో వైఎస్సార్ జిల్లా, బాలికల విభాగంలో కృష్ణా జట్లు నిలిచాయి. శనివారం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి,కృష్ణా వైఎస్సార్ కడప, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు . బాలికల విభాగంలో చిత్తూరు, గుంటూరు, శ్రీకా కుళం, అనంతపురం, కృష్ణా, కడప జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ జట్లు ఆదివారం పోటీపడ్డాయి. చివరకు చాంపియన్‌లుగా బాలికల విభాగంలో వైఎస్సార్‌కడప, బాలుర విభాగంలో కృష్ణాజిల్లాలు ప్రతిభ కరబరచి గెలుపొందాయి.ఈ క్రీడలో ప్రతిభ చూపినందుకు ఉత్తమ ఆటగాళ్లుగా వైఎస్సార్‌జిల్లాకు చెందిన ప్రశాంత్, బాలికల విభాగంలో కృష్ణాజిల్లాకు చెందిన సాహితిలను అవార్డును ప్రదానం చేశారు.



వెఎస్సార్ కడప బాలికల జట్టు

ఆటను అస్వాదించాలి... ఉమాశంకర్

ఆటగాడు క్రీడను ఆస్వాదించాలని జిల్లా బేస్‌బాల్ క్రీడాభివృద్ధి అధికారి, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకుడు ఉమాశంకర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బేస్‌బాల్‌లో గెలిచిన క్రీడాకారులకు ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు తనలో దాగి ఉన్న ప్రతిభను చూపటానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఓటమి అనేది గెలుపుకు సోపానం అన్న విషయాన్ని తెలుసుకుని ప్రస్తుతం జరిగిన ఆటలో దొర్లిన తప్పులను సరిచేసుకుని తిరిగి మరో పోటీలకు సిద్ధం కావాలని సూచించారు.

ఉత్సాహంగా అండర్–14 క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ స్టేడియంలోని నెట్స్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14 క్రికెట్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, జిల్లా క్రికె ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. వెంకటశివారెడ్డి మాట్లాడుతూ క్రికెట్‌లో రాణించేందుకు, ఉన్నతశ్రేణి క్రికెట్ ఆడేందుకు అండర్–14 వయో విభా గం అన్నది ఎంతో కీలకమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో సాధన చేయాలని పేర్కొన్నారు. క్రీడాకారులకు అసోసియేషన్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. రామ్మూర్తి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఒంగోలు, పేరిచర్ల, నరసరావుపేటల్లో నిర్వహించే అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి 43 మందితో ప్రాబ బుల్స్‌ను ఎంపికచేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా నాగభూష ణం, అశ్విన్‌కుమార్‌రాజు, శివప్రసాద్, ఖాజామైనుద్దీన్ వ్యవహరించారు.



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

అండర్–14 ప్రాబబుల్స్ : బాలస్వామిరెడ్డి, దిలీప్‌కుమార్, ఫజల్‌కరీం, సాయితన్మయ్, గురువిఘ్నేష్, రణధీర్‌రెడ్డి, శివకేశవరాయల్, గణేష్, సాయిధీరజ్‌రెడ్డి, కల్యాణ్, జిలానీఖాన్, మాధవ్, ఇర్ఫాన్, మెయిన్, రిత్విక్‌రెడ్డి, కుషినాథరెడ్డి, ఎస్ఎండీ రఫి, వినోద్‌కుమార్, రోహిత్‌వర్మ, జాహిద్‌బాషా, నిలేంద్ర, ఆదిత్య, ఫరీద్, సుజ్వంత్, దర్బార్‌రయాన్, సాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఒబేదుల్లా, సంజయ్‌భార్గవ్, చక్రపాణి, ఎస్ఎండీ అస్లాం, సాయికిరణ్, పి.ఆశిఫ్‌ఖాన్,అజయసింహారెడ్డి, అమానుల్లాఖాన్, రెడ్డి ఇంద్రగంగూలి, ఆదిల్‌హుస్సేన్, ధనుష్‌రెడ్డి, హేమంత్, అమన్‌జుబేర్, అవినాష్ తేజేష్, మనోజ్ కుమార్, ఖాసీం.

యుద్ధవిద్యలకు పెరుగుతున్న ఆదరణ

కడప స్పోర్ట్స్: ప్రస్తుత పరిస్థితుల్లో యుద్ధవిద్య క్రీడలకు క్రమేణ ఆదరణ పెరుగుతోందని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ తోటకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని మదర్‌ఇండియా పాఠశాలలో జిల్లాస్థాయి సిలంబం (కర్రసాము) ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. జిల్లా క్రీడాకారులు సైతం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తుండటం సంతోషించదగ్గ పరిణామమన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఏపీ సిలంబం అసోసియేషన్ చైర్మన్ వై. శివకృష్ణమూర్తి మాట్లాడుతూ సిలంబం క్రీడ నేడు దేశవ్యాప్తంగా శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి క్రీడాకారులు రావడం శుభపరిణామమన్నారు. రానున్న కాలంలో రాష్ట్రస్థాయి పోటీలను జిల్లాలో నిర్వహించేందుకు కృషిచేస్తామని తెలిపారు. అనంతరం పోటీలను నిర్వహించి జిల్లాజట్టును ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిలంబం అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిబాబు, కార్యదర్శి శ్రీకాంత్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె. వెంకటేష్, కోచ్‌లు దామోదర్‌రాజు, రాజశేఖర్, మస్తాన్‌హుస్సేన్, రెఫరీలు మహేష్‌బాబు, మణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ తోటకృష్ణ

బాలుర విభాగం...

సబ్‌జూనియర్ జట్టు : వై.లోకనితిన్, వై.ప్రనుష్, డి.రెడ్డి కల్యాణ్, ఎన్.మనికుమార్, ఎస్.ఫాజిల్‌బాషా, ఎన్.హేమంత్‌కుమార్, ఎస్.కార్తికేయ, పి.మహేష్‌బాబు, మన్సూర్. **జూనియర్స్ జట్టు :** ఎం.సాయియోగేష్, జి.దినేష్, గౌతమ్, శ్రీరామ్, శివమణి, రవితేజ, రుత్విక్, ఉదయ్, ప్రశాంత్, జక్కరయ్య. **సీనియర్స్ జట్టు :** జగన్ మోహన్‌రెడ్డి, నూర్‌మహమ్మద్, విష్ణువర్ధన్, ఆదిల్, ప్రసాద్, మహేంద్ర, మహేష్, గోపీచంద్, నాగన్న.

బాలికల విభాగం...

సబ్‌జూనియర్ జట్టు : మౌనిక, చిన్నరెడ్డమ్మ, హేమలత, శ్రీవాణి, మల్లేశ్వరి, మనోజ్ఞ, తేజశ్విని, ఉజ్వల, మహిమ జ్యోతి, సమీర. **జూనియర్స్ జట్టు :** సూర్యలక్ష్మి, గాయత్రి, మహేశ్వరి, సుజాత, భారతిలక్ష్మి, భాగ్యశ్విని, హరిలత, శివగంగ, సావిత్రి, గాయత్రి, దివ్య. **సీనియర్స్ జట్టు :** శ్రావణి, పద్మావతి, కాంచనగంగ, గంగోత్రి, మేఘన, వైష్ణవి, శివమంజు, రేఖ, స్నేహ, మాబూచాన్.

వైఎస్‌ఆర్ జిల్లా | సోమవారం | ఆగస్టు | 21 | 2017 సాక్షి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఈ ఏడాది నుంచి పరీక్షల్లో అమలు చేస్తున్న సెమిస్టర్ విధానం పట్ల విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని ఆ యూనివర్సిటీ విద్యార్థి విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయక్రిష్ణారెడ్డి అలియాస్ ఎల్వీకే తెలిపారు. సెమిస్టర్ విధానం విద్యార్థులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సార్వత్రిక విశ్వవిద్యాలయాల విభాగంలో దేశంలోనే సెమిస్టర్ విధానానికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తొలిసారిగా శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. ఎల్వీకే ఆదివారం రాజంపేటకు వచ్చిన సందర్భంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన పలు విషయాలను విలేకరులకు వెల్లడించారు. ఈసందర్భంగా 'సాక్షి'కి ఎల్వీకే ప్రత్యేక ఇంటర్వూ ఇచ్చారు. - రాజంపేట టౌన్



సాక్షి ఇంటర్వ్యూ

సెమిస్టర్ విధానంపై ఆందోళన వద్దు

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే

సాక్షి : సెమిస్టర్ విధానం వల్ల ప్రయోజనమేంటి?

జవాబు: సెమిస్టర్ విధానం వల్ల ఆరు నెలలకోమారు పరీక్షలు జరుగుతాయి. ఇందువల్ల సిలబస్ తక్కువగా ఉంటుంది కనుక విద్యార్థులు పాఠ్యాంశాన్ని లోతుగా అధ్యయనం చేసేందుకు వీలవుతుంది. ఫలితంగా విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కాగలరు. ఈఏడాది డిగ్రీ కోర్సులతో పాటు ఎంబీఏ, బీఎల్ ఐఎస్సీ కోర్సు పరీక్షలు కూడా సెమిస్టర్ విధానంలోనే జరుగుతాయి.

సాక్షి : సెమిస్టర్ విధానానికి తగ్గట్లు సిలబస్‌లో మార్పులు చేస్తున్నారా?

జవాబు: సెమిస్టర్ విధానాన్ని దృష్టిలో ఉంచుకోవడంతో పాటు విద్యార్థులు ఉపాధి అవకాశాలను పొందేలా యూనివర్సిటీ సిలబస్‌ను రూపొందిస్తుంది. అలాగే విద్యార్థులు సాఫ్ట్‌స్కిల్స్ పెంపొందించుకునేలా కోర్సులను ప్రవేశ పెడుతున్నాం.

సాక్షి : కొత్త కోర్సులు ఏవైనా ప్రవేశ పెడుతున్నారా?

జవాబు: విద్యార్థులు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టేదిశగా ఆలోచిస్తున్నాం. ఇందులో భాగంగా వివిధ సంస్థలతో చర్చలు జరుపుతున్నాము. ప్రస్తుతం ఉపాధి అవకాశాలను పొందేందుకు ఫోటోగ్రఫీ, స్కిల్ డెవలప్‌మెంటు కోర్సులు తమ యూనివర్సిటీలో ఉన్నాయి.

సాక్షి : ఈ ఏడాది మీ యూనివర్సిటీలో చేరేందుకు గడువు ఉందా?

జవాబు: డిగ్రీలో ప్రవేశానికై తాము రెండవసారి నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు కూడా ఇటీవలే విడుదలయ్యాయి. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశించే వారితో పాటు ఎంఎ, ఎంకాం, ఎంఎస్సీ, బీఈడీ, పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 24వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అర్హులైన వారు అడ్మిషన్ పొందవచ్చు.

సాక్షి : జిల్లాలో ఓపెన్ యూనివర్సిటీకి ఎలాంటి స్పందన ఉంది?

జవాబు: వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చాలామంచి స్పందన ఉంది. జిల్లాలో 12 స్టడీ సెంటర్లు ఉన్నాయి. నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

సాక్షి : మీ యూనివర్సిటీ ద్వారా ఎవరైనా ఉన్నత స్థాయికి వెళ్లారా?

జవాబు: ఇటీవల వెల్లడైన సివిల్ సర్వీస్‌సెస్ ఫలితాల్లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి అయిన బిందు మాధవ్ గరికపాటి 172వ ర్యాంకు సాధించారు. సాంప్రదాయ కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా తమ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభా పాటవాలు చూపుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది తమ యూనివర్సిటీలో చదివిన వారు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు.



పొద్దుటూరులో వినాయకుడి విగ్రహాన్ని మట్టితో తయారు చేస్తున్న దృశ్యం

మట్టి గణపయ్యకు జై..బోలో...

➠ పొద్దుటూరులో మట్టి విగ్రహాల తయారీ ➠ చవితి వేడుకలకు సిద్ధం



చవితి పండుగకు విక్రయాలకు సిద్ధం చేసిన మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు



పొద్దుటూరులో మట్టి విగ్రహాలను సహజ రంగులతో ముస్తాబు చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ :

వినాయక చవితి వచ్చిందంటే చాలు బొజ్జ గణపయ్యలను వాడవాడలా కొలువు దీరుస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.. అందువల్ల పర్యావరణ ప్రేమికులు మట్టితో తయారు చేసిన విగ్రహాలకే జై కొడుతున్నారు.

- పట్టణంలోని కుమ్మరికొట్టాలలో దాదాపు 10 కుటుంబాలు దాకా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. మిగతా సమయంలో వీరు కుండలు, హుండీలు, దీపపు సెమ్మెలను తయారు చేస్తుంటారు.
- మట్టిని కడప, మైదుకూరు నుంచి తీసుకువచ్చి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒకలోడు మట్టి దాదాపు 6 వేల రూపాయలు ఖర్చవుతుందని తయారీదారులు అంటున్నారు. వినాయక చవితికి 3 నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తారు. మట్టి పిసికి అచ్చుల్లో వేసి వినాయక విగ్రహాలను తయారు చేసి ఆరబెడతారు. తర్వాత వాటికి సహజ రంగులతో అందంగా తీర్చిదిద్దుతారు.
- అర అడుగు నుంచి రెండు అడుగుల మేర విగ్రహాలను తయారు చేసి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పర్యావరణానికి మేలు ...



మట్టి గణపయ్యలు పర్యావరణానికి ఎంతో మేలు. ఎలాంటి హానికరమైన రంగులు వాడకుండా మట్టి, దబ్బలు, చెత్తతో తయారు చేస్తాం. ఐదున్నర అడుగుల వినాయక విగ్రహాన్ని తయారు చేయడానికి ఐదు రోజులు పడుతుంది. మున్సిపల్ అధికారులు, కొందరు యువకులు, స్వచ్ఛంద సంస్థల వారు మట్టితో తయారు చేసే పెద్ద విగ్రహాలను ఆదరిస్తున్నారు.

- రామకృష్ణ, తయారీదారుడు, కుమ్మరికొట్టాల, ప్రొద్దుటూరు.

30 ఏళ్లుగా...



మట్టితో తయారు చేసిన చిన్న వినాయక విగ్రహాలను 30 ఏళ్లుగా విక్రయిస్తున్నాం. పండుగ మూడు నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తున్నాం. మట్టి విగ్రహాలకు ఆదరణ బాగా ఉంది.

- లక్షుమ్మ, తయారీదారురాలు, కుమ్మరికొట్టాల, ప్రొద్దుటూరు

ఏకదంతాయ... బహురూపాయ

▲ అరుదైన గణనాథుల విగ్రహాలతో అలలారుతోన్న పుష్పగిరి
▲ అద్భుత శిల్పకళకు నిలయం

పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి అరుదైన, విభిన్న గణనాథులతో అలలారుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఆలయ గోడలపై వివిధ రకాల శిల్పాలు ఉన్నా వినాయకుడి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయ కుడ్యాలపై వివిధ భంగిమల్లో ఉన్న వినాయకులు కనిపిస్తారు. విభిన్న గణపతులను ఒకే చోట దర్శించుకోవాలంటే మనం తప్పక పుష్పగిరిని సందర్శించాల్సిందే. వినాయక చవితి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.


- పుష్పగిరి (వల్లూరు)




కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ కుడ్యాలపై అలరిస్తున్న నృత్య గణపతి




సిద్ధి వినాయకుడు



మూషిక వాహనంపై పయనిస్తున్న వినాయకుడు



వైద్య నాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని నృత్య గణపతి



మూషికంపై వినాయకుడు

అరుదైన నృత్య గణపతి

పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ బాహ్య కుడ్యంపై అరుదైన నృత్య గణపతి శిల్పం మనోహరంగా కనిపిస్తుంది. ఎడమ వైపున గల చేతిలో పాశంకు బదులుగా తన తండ్రి కంఠాభరణంగా కనిపించే సర్పాన్ని చేత పట్టి కుడి కాలును నేలను తాకిస్తూ ఎడమ కాలును పైకి లేపి నృత్యం చేస్తూ కనిపిస్తాడు.

పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణలో వున్న శిల్ప సంగ్రహాలయంలో కూడా నృత్య గణపతి ముగ్ధ మనోహరంగా దర్శనమిస్తున్నాడు.

పాతాళ గణపతి

కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయానికి అభిముఖంగా పెన్నా నది ఒడ్డున పుష్పగిరిలో శ్రీ పాతాళ గణపతి ఆలయం వుంది. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగి శిథిలావస్థలో వున్న ఈ ఆలయాన్ని పురోహితులు రమణమూర్తి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాల క్రితం పునరుద్ధరించి పూజలు కొనసాగిస్తున్నారు. పేరుకు తగ్గట్లే ఈ ఆలయంలోని గణనాథుడు భూమి లోపల దర్శనమిస్తాడు. ఈ వినాయకునికి పూజలు చేయాలంటే మనం తప్పని సరిగా కొన్ని మెట్లు భూమిలోపలికి దిగాల్సిందే. పుష్పగిరికి వచ్చే ప్రతి భక్తుడు మొదట ఈ గణపతిని దర్శించుకున్న తరువాతనే ఇతర ఆలయాల్లోని మూర్తులను దర్శించుకొనే ఆనవాయితీ ఉన్నట్లు చారిత్రకాధారాలు వున్నాయని పండితులు పేర్కొంటున్నారు. ఈ వినాయకుని డుండి వినాయకుడిగా కూడా పిలుస్తారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ కాళహస్తిలో మాత్రమే ఇలా భూమిలోపల వున్న గణనాథున్ని మనం దర్శించుకోవచ్చునని పండితులు తెలుపుతున్నారు.


మూల స్థానంలో గణపతి

సాధారణంగా శివుని ఆలయాల్లో మూల స్థానంలో శివుడు వుంటే వినాయకుడు గుడిలోని ఏదో ఒక వైపున వుండడం సహజం. కానీ పుష్పగిరి కొండపైన గల శ్రీ సంతాన మల్లేశ్వర స్వామి ఆలయంలో మూల స్థానంలో వున్న తన తండ్రి మూల విరాట్‌కు వెనుక వైపునే కొలువుదీరి దర్శనమివ్వడం ప్రత్యేకత సంతరించుకుంది.

మూషిక వాహనంపై గణపతి

తన వాహనమైన మూషికం (ఎలుక) పై కూర్చుని స్థిరంగా వున్న గణనాథుడు మనకు ప్రతి చోట దర్శనమివ్వడం సర్వ సాధారణం. కానీ పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ కుడ్యాలపై మూషిక వాహనంపై పయనిస్తున్న వినాయకులను మనం వీక్షించవచ్చు.







కురిసింది వాన

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కడప నగరంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని వాన కురవడంతో పాదచారులు, వాహన చోదకులు, తోపుడు బండ్ల వ్యాపారులు, షాపింగ్‌కు వచ్చిన మహిళలు, పిల్లలు తడిసి ముద్దయ్యారు. వర్షంవల్ల లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. – కడప కార్పొరేషన్



అగ్ని విన్యాసం..

ఆదివారం ఉల్లాసంగా... ఉత్సాహంగా ప్రజలు గడిపారు. ఉదయం పొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి సర్కిల్‌లో మున్సిపల్ అధికారులు హ్యాపీ సండే కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. జానపద గేయాలాపనతో అలరించారు. దీంతో పుట్టపర్తి సర్కిల్‌లో సందడి నెలకొంది. అగ్ని విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. - ప్రొద్దుటూరు టౌన్